సంపుటి : 18
సంచిక : 153
Vol : 18
Issue : 153

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 13 ఆగస్టు 2026
Warangal, Thursday 13 August 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00


WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

## రీల్స్ మాయలో పడకండి

- పుస్తక పఠనం అలవర్చుకోండి
- విజయానికి దొంగదారులు వద్దు...
- షార్ట్‌కట్‌లను నమ్ముకుంటే జీవితాలు నాశనం..
- రీల్స్‌తో తగ్గుతున్న ఏకాగ్రత, ఆలోచన శక్తి
- యువత డిజిటల్ వినోదానికి అలవాటు పడొద్దు
- యూత్‌కు ప్రధాని మోడీ సూచనలు




7లో

## ఏజెన్సీలో తహసిల్దార్ల అవినీతి క్రీడ

- గిరిజనుల సాగు భూముల్లో వేరొకరికి పట్టాలు మంజూరు
- సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమికి వారసత్వ పట్టాలు జారీ
- బై నంబర్లతో వాజేడులో భారీ కుంభకోణం
- కొంగాల(జి) సర్వే నెం. 109లో గిరిజనుల మొర ఆలకించరా?
- ముత్తారం(జి) 15/1, 15/2, ఎడ్లర్లపల్లి(జెడ్) 91 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమికి పట్టాల సంగతేంటి?
- రెవెన్యూ రికార్డులలో కనిపించని సెటిల్మెంట్ పట్టాలపై ఆరా తీయరా?
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న గిరిజనులు
- తహసిల్దార్ వ్యవహార శైలిపై అనుమానాలు?
- ఏజెన్సీలో 1/70 చట్టాన్ని ఖూనీ చేస్తున్న రెవెన్యూ అధికారులు
- రెవెన్యూ అధికారుల మాయాజాలమే అంటున్న గిరిజన నాయకులు
- ఉన్నతాధికారుల మౌనం గిరిజనులకు శాపంగా మారేనా?

2లో



## సెప్టెంబర్ నుంచే కొనుగోళ్లు ప్రారంభం



- తెలంగాణ పత్తి రైతులకు అలర్ట్..
- సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- దాదాపు 25.85 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

2లో



## నిలిచిపోయిన పనులు షురూ...

7లో

పీపుల్స్ డైరీ ఎఫెక్ట్

- 'పీపుల్స్‌డైరీ' కథనానికి విశేష స్పందన
- ఇక డ్రైనేజీ సమస్యకు చెక్
- కదిలిన అధికార యంత్రాంగం
- 'పీపుల్స్‌డైరీ'కి స్థానికుల కృతజ్ఞతలు

(పీపుల్స్ డైరీ) నర్సంపేట

## డబుల్ గేమ్

- ప్రజాప్రతినిధుల ద్వంద్వ వైఖరి...
- ప్రభుత్వ దవాఖానలకు ప్రచారం... కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహం!
- సర్కార్ వైద్యశాలలపై కపట ప్రేమ
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో కొందరు కీలకనేతల పెట్టుబడులు?
- ఓట్లకోసం ప్రభుత్వ ఆస్పత్రులు.... లాభాల కోసం ప్రైవేట్ దవాఖానలు..

✍ కొండపర్తి కిరణ్
(ప్రధాన ప్రతినిధి)




2వ పేజీలో..



## టీఎస్ బీపాస్... అక్రమ నిర్మాణాలకు బైపాస్

### ప్రభుత్వ భూములు, పంట పొలాల్లో భారీ నిర్మాణాలు?

- తప్పుడు పత్రాలు సమర్పిస్తున్న వ్యాపారులు..
- తనిఖీలు చేయని టాస్క్ ఫోర్స్ బృందాలు..
- క్షేత్రస్థాయి అధికారులు వద్దన్న చోట బిపాస్‌తో అనుమతులు ..



7వ పేజీలో..

పీపుల్స్‌డైరీ-ములుగు బ్యూరో :

## కలానికే కలంకం!

- వికలాంగుడి ప్లాట్‌కు ఎసరు పెట్టిన ఓ రిపోర్టర్..!
- దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా..?
- 63/28 నుంచి 63/39 వరకు భూములపై అనుమానాలు..
- కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేశాడంటున్న స్థానికులు
- రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకు..?
- సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలని జనం డిమాండ్

2వ పేజీలో..



పీపుల్స్‌డైరీ - బోడుప్పల్ :

# నేతల డబుల్ గేమ్?

కొండపర్తి కిరణ్ (ప్రధాన ప్రతినిధి)



- ప్రభుత్వ దవాఖానలకు ప్రచారం... కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహం!
- ప్రజాప్రతినిధుల ద్వంద్వ వైఖరి...
- సర్కార్ వైద్యశాలలపై కపట ప్రేమ
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో కొందరు కీలకనేతల పెట్టుబడులు?
- ఓట్లకోసం ప్రభుత్వ ఆస్పత్రులు.... లాభాల కోసం ప్రైవేట్ దవాఖానలు...

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులు ఉన్నాయి పేద, మధ్యతరగతి ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా సర్కార్ వైద్యానికే ప్రాధాన్యత ఇవ్వండి, కార్పొరేట్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోవద్దు" అంటూ వేదికలపై ప్రజాప్రతినిధులు, మంత్రులు ఇచ్చే మైక్ స్పీచులు, పత్రికల్లో వచ్చే ప్రకటనలు ఇవి. కానీ క్షేత్రస్థాయికి వస్తే దృశ్యం తలకిందులవుతోంది. ఒకవైపు సర్కార్ వైద్యాన్ని ఆకాశానికెత్తుతూనే, మరోవైపు రంగురంగుల విద్యుత్ కాంతుల మధ్య అట్టహాసంగా ప్రారంభమయ్యే కార్పొరేట్ ఆసుపత్రుల రిబ్బన్లు కట్ చేయడానికి అదే కొంత మంది మంత్రులు, ప్రజాప్రతినిధులు క్యూ కడుతున్నారు.

ఓటు బ్యాంకు కోసం సర్కార్ దావఖానాలను పొగుడుతూ, వెనుక మాత్రం కార్పొరేట్ వ్యవస్థను పెంచి పోషిస్తున్న ప్రజాప్రతినిధుల ఈ ద్వంద్వ వైఖరిపై సామాన్య ప్రజానీకం తీవ్ర అసంతృప్తి నీ వ్యక్తం చేస్తోంది.

**రిబ్బన్ కటింగ్లు ఒకరివి... లాభాలు మరొకరివి**

ప్రజాప్రభుత్వాల్లో కీలక పదవుల్లో ఉన్న నాయకులు కార్పొరేట్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు హాజరవ్వడమే కాకుండా, సదరు ప్రైవేట్ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారడం గమనార్హం. మా నియోజకవర్గానికి లేదా రాష్ట్రానికి వరల్డ్ క్లాస్ వైద్యం వచ్చింది అని ప్రైవేట్ సంస్థలను కొనియాడే కొందరు మంత్రులు అదే నోటితో ప్రభుత్వ ఆసుపత్రుల గొప్పతనం గురించి మాట్లాడటం రాజకీయ విడ్డూరానికి పరాకాష్ట అని తెలుస్తుంది.

మరింత విచారకరమైన విషయమేమిటంటే... కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా లేదా తమ బంధువులు, అనుచరుల పేర్లతో ఈ కార్పొరేట్ ఆసుపత్రుల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాల్సిన పాలకులే, ప్రైవేట్ వ్యాపారాల్లో భాగస్వాములుగా మారడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సర్కార్ వైద్యంపై నిజమైన శ్రద్ధ ఏది?**

ఒకవేళ ప్రభుత్వ దవాఖానల్లో నిజంగానే కార్పొరేట్ స్థాయి వసతులు, నిపుణులైన డాక్టర్లు, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంటే, ప్రైవేట్ ఆసుపత్రుల విస్తరణకు మంత్రులే స్వయంగా సహకరించి వాటికి పర్మిషన్లు సైతం ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది అని ప్రజల చర్చలకు తావిస్తోంది.

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మందులు, పరికరాలు, డాక్టర్ల కొరతను తీర్చడంలో నిధుల కొరత సాకుగా చూపే పాలకులు ప్రైవేట్ ఆసుపత్రులకు మాత్రం భూ కేటాయింపులు, అనుమతుల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవడం దేనికి సంకేతం?

అత్యవసర వైద్యం కోసం స్వయంగా ప్రజాప్రతినిధులే కార్పొరేట్ దవాఖానాల వైపు పరుగులు తీస్తుంటే, సామాన్యుడికి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం ఎలా కుదురుతుంది?

**రాజకీయ ప్రయోజనాలు - ప్రజా ఆరోగ్యంతో చెలగాటం**

రాజకీయ నాయకుల ఈ వ్యాపార బంధాల వల్ల నష్టపోతున్నది అంతిమంగా సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజలే. కార్పొరేట్ వ్యవస్థను అడ్డగోలుగా ప్రోత్సహించడం వల్ల వైద్యం ఒక వ్యాపారంగా మారి, సామాన్యుడికి భారాన్ని పెంచుతోంది. ఒకవైపు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రభుత్వ ఖజానా నుండి వందల కోట్లు మళ్లీ ఈ కార్పొరేట్ ఆసుపత్రుల జేబుల్లోకే చేరుతున్నాయనేది బహిరంగ రహస్యం.

**నాయకుల వైఖరి మారాలి...**

ప్రజాస్వామ్యంలో పాలకుల బాధ్యత ప్రజాసంక్షేమమే కానీ ప్రైవేట్ వ్యాపారాల విస్తరణ కాదు. ప్రజాప్రతినిధులు కేవలం ప్రసంగాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రాథమిక చికిత్సల నుంచి పెద్ద వ్యాధుల వరకు ప్రభుత్వ దవాఖానల్లోనే వైద్యం చేయించుకునేలా ఆదర్శంగా నిలవాలి అని కార్పొరేట్ ఆసుపత్రులతో ప్రజాప్రతినిధుల ముసుగు వ్యాపారాలకు, ప్రత్యక్ష/పరోక్ష పెట్టుబడులకు స్వస్తి పలకాలి అని, మాటల్లో ఒకలా, చేతల్లో మరొకలా ప్రవర్తిస్తూ కార్పొరేట్ వ్యవస్థకు రెడ్ కార్పెట్ వేసే వైఖరిని పాలకులు ఇప్పటికైనా విడనాడకపోతే సర్కార్ వైద్యం సర్వనాశనం అవ్వడమే కాక, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు అని కొందరు రాజకీయ విశ్లేషకులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఏజెన్సీలో తహసిల్దార్ల అవినీతి క్రీడ




- గిరిజనుల సాగు భూముల్లో వేరొకరికి పట్టాలు మంజూరు
- సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమికి వారసత్వ పట్టాలు జారీ
- బై నంబర్లతో వాజేడులో భారీ కుంభకోణం
- కొంగాల(జి) సర్వే నెం. 109లో గిరిజనుల మొర ఆలకించరా?
- ముత్తారం(జి) 15/1, 15/2, ఎడ్జర్లపల్లి(జెడ్) 91 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమికి పట్టాల సంగతేంటి?
- రెవెన్యూ రికార్డులలో కనిపించని సెటిల్మెంట్ పట్టాలపై ఆరా తీయరా?
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న గిరిజనులు
- తహసిల్దార్ వ్యవహార శైలిపై అనుమానాలు?
- ఏజెన్సీలో 1/70 చట్టాన్ని ఖూనీ చేస్తున్న రెవెన్యూ అధికారులు
- రెవెన్యూ అధికారుల మాయాజాలమే అంటున్న గిరిజన నాయకులు
- ఉన్నతాధికారుల మౌనం గిరిజనులకు శాపంగా మారేనా?

**ములుగు ప్రతినిధి-పీపుల్స్ డైరీ :**

గిరిజన ప్రాంతాలలో పనిచేసిన తహసిల్దార్లు ధరణి వేదికగా చేసిన భూ కుంభకోణాలు ఒక్కొక్కటిగా రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. రెవెన్యూ రికార్డులతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా చేసిన అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా అవినీతి రాజ్యం ఏలుతుంది. గిరిజనులు సుమారు 60 ఏళ్లుగా సాగులో ఉన్న భూములు 163 జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నాయి. కొంగాల (జి) రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 109లో గల సుమారు 9 ఎకరాల భూమికి మంచి డిమాండ్ ధర ఉంది. అమాయకపు ఆదివాసీలు సాగులో ఉన్నారని తెలుసుకున్న గిరిజనేతర ధనికులకు ఈ భూమిపై కన్ను పడింది. ఈ భూమిని ఎలాగైనా కాజేయాలని ఫన్నిన కుట్రకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలికారు. అమ్ముడుపోయిన అధికారులకు సేద్యంలో ఎవరు ఉన్నారనే నిజాలు కనిపించలేదు కాబోలు. వాస్తవాలను సమాధి చేసిన అక్రమార్కుల కుట్రలతో, జీవం పోసుకున్న నకిలీ కాగితాలకు 'తహసిల్దార్' కార్యాలయంలోని అధికారులు నిజాయితీని తాకట్టు పెట్టడంతో, 109లోని గిరిజనుల సాగు భూమికి అక్రమంగా పట్టాలు వేరొకరికి మంజూరు అయ్యాయి.

అవినీతిపరుల పథకం ప్రకారం వేసవికాలంలో ఆ భూమిని ట్రాక్టర్ తో దున్ని ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న గిరిజనులు దిక్కుతోచని స్థితిలో ఎర్రజెండా పార్టీ నాయకులను ఆశ్రయించారు. బాధితులతో తహసిల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా మౌనంతో శిలా విగ్రహాల పాత్ర పోషించినట్లు, అవినీతికి పాల్పడిన కారణంగానే ఇతరులకు పట్టాలు వచ్చాయని నాయకులు వాపోయారు. భూ పట్టాలు ఎంత ముఖ్యమో కూడా తెలియని ఆదివాసీలు భూమి తమ ఆధీనంలోనే ఉందని సాగు చేస్తూ సంబరపడుతున్నారు. కానీ భూ పట్టాలు పొందిన కుట్ర దారులు మాత్రం "పొజిషన్ సర్టిఫికెట్" పొందేందుకు, భూమిని స్వాధీనం చేసుకునేందుకు, రెవెన్యూ అధికారులకు గాలం వేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముత్తారం (జి) రెవిన్యూ గ్రామంలోని సర్వే నెంబర్లు వరుసగా 15/1, 15/2ల లోని భూమి, ఎడ్జెర్లపల్లి (జెడ్) సర్వే నంబర్ 91లో గల భూమి ప్రభుత్వ భూమి అని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఆ భూమి ప్రస్తుతం రికార్డులలో మాయం అయ్యి ఇతరులకు బై నంబర్లతో వారసత్వ భూమిగా రూపుదిద్దుకుంది. 1/70 చట్టం అమల్లో ఉన్న గిరిజన ప్రాంతాలలో 1970 తర్వాత వచ్చిన సెటిల్మెంట్ పట్టాలు చెల్లుబాటు కాదని చట్టం చెబుతుంది. అయినప్పటికీ ఆ షరతులు ఏమి గిరిజన ప్రాంతాలలో రెవెన్యూ అధికారులు ఆదివాసేతరులకు వర్తింప చేయడం లేదు. మధ్యరకంగా పుట్టుకొస్తున్న సెటిల్మెంట్ పట్టాలకు రికార్డులతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా పట్టాలు మంజూరు చేస్తున్నారేది నానుడి.

ప్రభుత్వ భూమిలో అక్రమంగా అధికారులు పట్టాలు మంజూరు చేశారని కొందరు గిరిజన నాయకులు కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. ఆ విషయమై "పీపుల్స్ డైరీ" దినపత్రిక సమక్షంలో కొందరు గిరిజనులు ప్రభుత్వ భూములకు, గిరిజనులు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఎలా మంజూరు చేశారు? అందుకు సంబంధించిన ఫైళ్లను, రికార్డులను చూపించాలని, ఏ తహసిల్దార్ ఇంతటి పాపానికి ఒడిగట్టారో తెలియాలని ప్రశ్నించగా అందుకు తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ ఏకాంతంగా ఒక గంట వ్యవధి వరకు చర్చించుకుని సమయం కావాలని బదులిచ్చారు.

కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులను అడ్డుపెట్టుకొని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో పట్టాలు పొందిన వారి ఫైల్ ను గోప్యంగా ఉంచుతున్నట్లు, రెవెన్యూ రికార్డులను దాచడంతో పాటు తరచూ వారిని కలుస్తూ లావాదేవీలు జరుపుతున్నట్లు వాదనలు వస్తున్న నేపథ్యంలో ఓ గిరిజన నాయకుడు పూనెం మునేశ్వరరావు ఆ వాదనలన్నీ నిజమేనని 'పీపుల్స్ డైరీ'కి తెలిపారు.





## భూములను గిరిజనులకు పంచాలి..

**చింత సోమరాజు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు..**



వాజేడు మండలంలో ఉన్న భూస్వాములలో ఎక్కువ మంది వలస వచ్చిన వారే అధికంగా ఉన్నారు. అలాంటి వారందరి భూములపై విచారణ జరిపించాలి. రెవిన్యూ అధికారులు అమ్ముడుపోతున్నారు. ప్రస్తుతం ఉన్న రెవిన్యూ అధికారుల వ్యవహార శైలి 1/70 చట్టానికి విరుద్ధంగానే కనిపిస్తుంది. ఇలాంటి అధికారులతో గిరిజనులకు ప్రయోజనం ఉండదు. ప్రమాదమే ఉంటుంది. 109లోని గిరిజనులకు న్యాయం చేయాలి. ప్రభుత్వ భూములలో మంజూరైన పట్టాలను రద్దుచేసి ఆ భూమిని గిరిజనులకు పంచాలి. లేకుంటే ఉద్యమాన్ని చేపడతాం.

## ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి..

**పద్దం సుధాకర్, జిఎస్పి మండల అధ్యక్షుడు వాజేడు**



రెవిన్యూ అధికారులు కావాలనే అక్రమార్కుల రహస్యాలను గోప్యంగా ఉంచుతున్నారు. కార్యాలయంలో పైసలు ఇస్తేనే పని జరుగుతుంది. నా కళ్ళ ముందరే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కు 1000 రూపాయలు తీసుకున్నారు. వందల్లో అయినా వెయ్యిల్లో అయినా పైసా లేనిదే ఫైల్ కదలడం లేదు. జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలి. ఇలాంటి అధికారులు మాకు వద్దు. అక్రమంగా మంజూరు చేసిన పట్టాలు రద్దుచేసి గిరిజనుల సాగు భూమికి పట్టాలు మంజూరు చేయాలి. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

# సెప్టెంబరు నుంచే కొనుగోళ్లు ప్రారంభం

- తెలంగాణ పత్తి రైతులకు అలర్ట్..
- సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- దాదాపు 25.85 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో 2026–27 పత్తి కొనుగోలు సీజన్‌ను ఈసారి సెప్టెంబరు నెల నుంచే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంట చేతికొచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

ఈ వర్షాకాల సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగ్గా.. దాదాపు 25.85 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ దిగుబడిని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను ముందస్తుగానే పక్కాగా ప్రణాళిక చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 131 ప్రధాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 356 జిన్నింగ్ మిల్లులను సేవలకు సిద్ధం చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లులు లేని ప్రాంతాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లులకు అనుసంధానించాలని సూచించారు.

కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, లోపాలను నివారించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలను వేస్తున్నారు. వీటిలో రైతు ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. రైతులు విక్రయాల కోసం ఉపయోగించే కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సాంకేతిక పరిజ్ఞానం లేని ప్రతీ రైతుకూ సులభంగా అర్థమయ్యేలా మార్చనున్నారు. మిల్లులలో తేమ శాతం, నాణ్యతను పరీక్షించే పరికరాలు సక్రమంగా ఉండేలా చూడాలని, నాణ్యత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకూడదని మంత్రి స్పష్టం చేశారు.

రైతుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రత్యేకంగా 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించనున్నారు. గత సీజన్లలో విజిలెన్స్ విభాగాలు గుర్తించిన తూకం, రసీదులు, చెల్లింపుల లోపాలు ఈసారి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని పొడిగించాలని మంత్రి యంత్రాంగాన్ని ఆదేశించారు.

# కలానికే కలంకం

- వికలాంగుడి ప్లాట్‌కు ఎసరు పెట్టిన ఓ రిపోర్టర్..!
- దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా..?
- 63/28 నుంచి 63/39 వరకు భూములపై అనుమానాలు..
- కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేశాడంటున్న స్థానికులు
- రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకు..?
- సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలని జనం డిమాండ్

**పీపుల్స్‌డైరీ – బోడుప్పల్ :** ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యానికి ఇదో నిదర్శనంగా చెప్పవచ్చు. బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబర్ 63/28 నుంచి 63/39 వరకు ఉన్న భూముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారనే ఆరోపణలతో పాటు, వికలాంగుడికి చెందిన ప్లాట్‌ను సైతం కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. ఓ రిపోర్టర్‌గా పేర్కొంటున్న వ్యక్తి వికలాంగుడికి చెందిన ఫ్లాట్‌ను కబ్జా చేసి, అక్కడ దర్జాగా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ భూమికి సంబంధించిన సర్వే నంబర్లపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత..? భూమికి సంబంధించిన హక్కులు ఎవరికి ఉన్నాయి..? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా..? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**రికార్డులు ఏమంటున్నాయి..?**

63/28 నుంచి 63/39 వరకు ఉన్న భూములకు సంబంధించిన సర్వే రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిలో రిపోర్టర్ కు ఫ్లాటు పత్రాలు, నిర్మాణ అనుమతులు ఎలా వచ్చాయో అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. భూమి ప్రభుత్వానికి చెందినదని విషయాన్ని అధికారిక రికార్డుల ఆధారంగా తేల్చాలని వారు కోరుతున్నారు.

**వికలాంగుడి ఫ్లాట్‌పై వివాదం ఏమిటి..?**

వికలాంగుడికి చెందిన ఫ్లాట్‌ను కబ్జా చేశారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. నిజానికి గతంలో చేసిన లేఅవుట్ లో ఫ్లాట్‌పై వికలాంగుడు కొనుగోలు చేసి తన కూతురుకు ఇచ్చాడు. కానీ నకిలీ పత్రాలతో నాది అని రిపోర్టర్ పేరుతో భయభ్రాంతులకు గురి చేసి ఆ ఆస్తిపై నిర్మాణం చేపట్టినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణానికి ఏమైనా అనుమతులు ఉన్నాయా..? ఫ్లాట్‌ను ఎలా స్వాధీనం చేసుకున్నారు..? అనే అంశాలపై అధికారులు విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల నిఘా ఎక్కడ..?**

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. నిర్మాణం పూర్తయ్యే వరకు అధికారులు గుర్తించలేదా..? లేక ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోలేదా..? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమి కబ్జా ఆరోపణలు నిజమైతే,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో ఆరోపణలు తప్పయితే, అధికారిక రికార్డులతో వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు అంటున్నారు.

**సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్**

ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేసి, సర్వే నంబర్ల వారీగా భూమిని కొలిచి,రెవెన్యూ రికార్డులను తనిఖీ చేసి,నిర్మాణ అనుమతులు మరియు ఆస్తి హక్కులను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమి కబ్జా జరిగిందా..? వికలాంగుడి ఫ్లాట్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారా..? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా..? అనే ప్రశ్నలకు అధికారుల విచారణతోనే సమాధానం లభించనుంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను నిగ్గుతేల్చి,తప్పు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమార్కుడు ఇచ్చే అమ్యామ్యాలకు లొంగకుండా నిక్కచ్చిగా విచారణ జరిపి నిజనిజాలను బయటపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతుఓంది.



# గుండెనిండుగా తిరగ ర్యాలీ...రేగొండలో ఘనంగా తిరంగా ర్యాలీ



**రేగొండ ఆగస్టు 12 పీపుల్స్ డైరీ...** భూపాలపల్లి నియోజకవర్గ రేగొండ మండల కేంద్రంలో బిజెపి రేగొండ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఆధ్వర్యంలో వాణి స్కూల్ మరియు విక్టరీ స్కూల్ పిల్లలతో కలిసి రేగొండ పెద్ద బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకి ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఏడునుతుల నిశీదర్ రెడ్డి, హాజరై అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీ యులను స్మరించుకుంటూ వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛ భారత దేశంలో జీవిస్తున్నామని అలాగే హర్ ఘర్ తిరంగ్ అనే నినాదంతో ప్రతి ఇంటిపై ఒక జాతీయ జెండా ఎగరవేయాలని ఆగస్టు 15 వ తారీకు వరకు ఒక పండుగలా జరుపుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, జిల్లా నాయకులు గన్ రెడ్డి లింగారెడ్డి, జాలిగాపు రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేష్, మండల ఉపాధ్యక్షులు సర్వు కుమార్, గాండ్ల రమేష్, మండల నాయకులు సామల సంతోష్, మాతృపెల్లి అరవింద్,బి జే వై యం జిల్లా నాయకులు మాత శంకర్, రేసోజు శివరాజ్, సాదు దేవేందర్, బానోతు రాజేందర్ ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, దేశ్మీ సాంబయ్య, పెండల సంపత్, నేరెళ్ల శంకర్, చల్ల విక్రం, కన్నబోయిన భాస్కర్, పొనుగంటి శ్రీను, పగడాల మనోహర్ బండి రాజు సాయి రెడ్డి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు...

# అర్హులైన కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలి

- **పింఛన్ల పథకం కింద అర్హులైన కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాలపల్లి ఆగస్ట్ 12 పీపుల్స్ డైరీ..** చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకం కింద అర్హులైన కొత్త లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి చేయూత సామాజిక భద్రత పింఛన్ల కొరకు దరఖాస్తులు స్వీకరణ, జలసిరి, ప్రతి సోమవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహణ, వనమహోత్సవం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్, మున్సిపల్, వైద్య, ఎక్సైజ్ తదితర అంశాలపై ఐడిఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయూత పింఛన్ల కొత్త మంజూరుకు సంబంధించి సెర్ఫ్ సర్క్యులర్ ప్రకారం అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా మరియు డయాలసిస్ బాధితులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్, గ్రీవెన్స్ కార్యక్రమాల్లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లైతే అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో దరఖాస్తు చేయని వారు, అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా కొత్తగా అర్హత సాధించిన వారు మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆగస్టు 31, 2026లోగా స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి/ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారి /మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు దారులు ఆధార్, వయస్సు ధృవీకరణ, రేషన్ కార్డు లేదా అవసరమైన ఆదాయ ధృవీకరణ, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు సంబంధిత పింఛన్ వర్గానికి అవసరమైన ప్రత్యేక ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. పింఛను కొరకు దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తెలిపారు. అన్ని ఎంపిడిఓ, మున్సిపల్ కార్యాలయంలో చేయూత హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి పింఛన్లు కొరకు దరఖాస్తు చేయు వ్యక్తులకు సహాయతను అందించాలని తెలిపారు. జలసిరిలో చేపట్టిన ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓలు, ఏపీఎంలను కలెక్టర్ ఆదేశించారు. విఓలకు కేటాయించిన లక్ష్యం మేర ఫామ్ పాండ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే వ్యక్తిగత ఇంకుడు గుంతలు, పెర్కొలేషన్ ట్యాంకులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, బోర్‌వెల్ రీఛార్జ్ వంటి జలసిరి పనులను ప్రారంభించాలని ఆదేశించారు.



### మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో ప్రజావాణి నిర్వహణకు ఎంపీడీఓను నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేసేందుకు హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్, డేటా ఎంట్రీ సదుపాయం ఏర్పాటు చేయాలని, అర్జీలు రాయడంలో ప్రజలకు సహాయం అందించాలని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు, తగినన్ని కుర్చీలు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజ యలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎక్సైజ్ ఈఎస్ కిరణ్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటరత్నం మండల కేంద్రాల నుంచి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టీయూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసులో లింగాల మహేష్ గౌడ్

**మరిపెడ ,ఆగస్టు 12(పీపుల్స్ డైరీ) :** పిఆర్టీయూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి రేసులో పిఆర్టీయూ మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు లింగాల మహేష్ గౌడ్ ముందుంజలో ఉన్నారు. వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు (మీాజ) పింగిళి శ్రీపాల్ రెడ్డి గారి ఆశీస్సులతో, పిఆర్టీయూ రాష్ట్ర శాఖ మద్దతుతో ఆయన ముందుకు సాగుతున్నారు.



### సుదీర్ఘమైన సేవా అనుభవం & కీలక బాధ్యత

9 ఏళ్లుగా సేవలు గత 09 సంవత్సరాలుగా మరిపెడ మండల ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రసుతం మరిపెడ మండల కేంద్రంలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్నారు.

పోరాటాల పంథా -- విద్యార్థి నాయకుడి నుండి ఉపాధ్యాయ నాయకుడి వరకు

### తెలంగాణ ఉద్యమకారుడు

మలిదశ తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో విద్యార్థి జీూజ నాయకుడిగా మరిపెడ మండలంలో తనదైన శైలిలో పోరాటాలు చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

### CPS రద్దు పోరాటం

సిపియస్ (జూూ) విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఉపాధ్యాయుల సమస్య ఏది వచ్చినా తక్షణమే స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే 'ఉపాధ్యాయ ఉద్యమ వీరుడు'గా పేరుపొందారు. యువకుడు, అత్యంత ఉత్సాహవంతుడైన లింగాల మహేష్ గౌడ్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం వస్తే జిల్లాలో పిఆర్టీయూ మరింత బలోపేతం అవుతుందని, ఉపాధ్యాయ సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాక్‌బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌కు కల్వకుంట్ల కవిత అభినందనలు



**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయంలో విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అభినందించారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్ కల్వకుంట్ల కవితను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాల్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో భాగస్వామి కావడం తెలంగాణకు, మేడ్చల్ జిల్లాకు గర్వకారణమని కవిత పేర్కొన్నారు. తెలంగాణ యువత క్రీడా రంగంలో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సేన మహిళా అధ్యక్షురాలు వనజ, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండికోట కుమార్, గ్రామస్తులు శ్రీపాల్ యాదవ్, కిరణ్, సాయిబాబు, చిత్తారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆళ్ళపల్లి ఆగస్టు12(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రము లో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కొమరం హనుమంతరావు అరుణ పథకాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్బుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించింది. అని అన్నారు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసచేర నుంచి మాతృభూమి విముక్తి క సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మహక్కు అని మా అంతం చూసిన స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల విప్లవ కిషోరులను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని హనుమంతరావు వినయ్, అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు రహీం, తాళ్లపల్లి రమేష్, ఆరిఫ్ శివ ఆకాష్ రమేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు,

# కుల విచ్ఛిన్న శక్తులను ఎదుర్కోవాలి

### పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న



**మరిపెడ,ఆగస్టు 11(పీపుల్స్ డైరీ) :** కుల విచ్ఛిన్న శక్తులను ఎదుర్కొని ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని లిజిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల వెంకన్న అన్నారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని కనదుర్గ కళ్యాణ మండపంలో డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల పద్మశాలి సంఘం ముఖ్య నేతల సమావేశం మరిపెడ సంఘం అధ్యక్షుడు దిగజర్ల శ్రీనివాస్(పేపర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ..పద్మశాలీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలను నెరవేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు,చలిమల్ల నారాయణ,ఊరుకొండ శ్రీనివాస్,బత్తుల రమేష్,కొండబత్తిని జగదీశ్వర్,కొండబత్తుల వెంకన్న,దాసరి నరేందర్,వెన్నం జనార్ధన్,మేనామ్ వెంకన్న,మాసబత్తిని సతీష్,దిగిజెర్ల ముఖేష్,మేకల యాకయ్య,బాల్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్



**సింగరేణి, (కారేపల్లి) ఆగష్టు 12 (పీపుల్స్ డైరీ):** మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్ కుమారుడు, ఫారెస్ట్ అధికారి నవీన్ విధి నిర్వహణలో విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ వైరా ఎమ్మెల్యే లావుడియ రాములు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రాములు నాయక్ భద్రాచలం వెళ్లి నవీన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుని తండ్రి మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లా నాయక్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నవీన్ మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని, కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. అనంతరం డీఎఫ్ఓతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ వెంట మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సర్పంచ్ ధరావత్ మంగిలాల్, మాజీ సర్పంచ్ వాంకుడోత్ కృష్ణ, సీనియర్ నాయకులు వాంకుడోత్ గోపాల్, అజ్మీరా వీరన్న, ఏన్కూరు నాయకులు బానోత్ సురేష్ తదితరులు ఉన్నారు.

# కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలి

### తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కుమార్ మాదిగ



**జమ్మికుంట అగస్ట్ 12పీపుల్స్ డైరీ :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వస్తున్న ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం త్వరలో ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాలను కలుపుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ఒక వేదిక ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు ఐక్య కార్యచరణ ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల్లోని ఎస్సీ ఎస్టీ బీసీ ఎమ్మెల్యేలను ఎంపీలను ఇతర పదవులలో ఉన్న రాజకీయ నాయకులను కలుపుకొని ఢిల్లీలో ప్రధానికి ఒక వినతిపత్రం సమర్పిస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# మున్సిపల్ స్థలాలు, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట అగస్ట్ 12పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణానికి గతంలో త్రాగు నీరు అందించిన విలాసాగర్ వాటర్ పంప్ హౌస్ ను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలను పరిరక్షించేందుకు కంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడంతో పాటు,ఆక్రమణలకు తావులేకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు మున్సిపల్ ఆస్తుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ స్వామి, టీపీఎస్ రమేష్,గౌరవ కౌన్సిలర్స్,సంబంధిత అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

పీపుల్స్ డైరీ

వరంగల్

గురువారం, 13 ఆగస్టు 2026

సంపుటి : 18, సంచిక : 153




## జమ్మికుంట తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ



**జమ్మికుంట అగస్ట్ 12పీపుల్స్ డైరీ :** విద్యారంగ మరియు ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (ఖుజ్రాజ) పిలుపుమేరకు రెండవ దశ నిరసన కార్యక్రమములో భాగంగా ఈరోజు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జమ్మికుంట మండల తహసీల్దార్ కి మెమోరాండం సమర్పించడం జరిగింది . ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ రంగానికి చెందిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పి ఆర్ సి కమిషన్ రిపోర్ట్ వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డి ఏ లను విడుదల చేయాలని, జీవో 25న సవరించి ప్రాథమిక పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అవినాష్ మాట్లాడుతూ. సి పి ఎస్ ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు డిటిఎఫ్ మండల అధ్యక్షులు వేణుమాధవ్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టబోయే వర్క్ అడ్జస్ట్మెంట్ ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా పారదర్శకంగా జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట టి పి టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి డిటిఎఫ్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి కె. సంపత్ డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం సదానందం డిటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం శ్రీనివాస్ పి.రాజు, పి విజెందర్ రెడ్డి ,హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయ్ నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ




**కోహెడ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** ఉదయ్ నాగరాజు కి మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా పౌర సమాజం పక్షాన పౌర సన్మానం కార్యక్రమం వేదిక విపంచి కళా నిలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోహుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్, మాజీఎమ్మెల్సీలు పార్కుహుస్సేన్, నారదాసు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్ కుమార్,కరీంనగర్ జిల్లా బీ ఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ జీవీ రమణారావు, మాజీ జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎంపీపీలు మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బీ ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కోహెడ మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ మాట్లాడుతూ మన సిద్దిపేట జిల్లా నుండి కోహెడ మండలంశనిగరం గ్రామం నుండి బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఉదయ్ నాగరాజు ఎన్నికైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఆపదలో అండగా...

### వివాహ వేడుకకు ఆర్థిక చేయూత కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్



**మేడ్చల్ ఆగస్టు 12(పీపుల్స్ డైరీ):-** ప్రజాప్రతినిధిగా తన పరిధిలోని ప్రజల సమ స్యలతో పాటు వారి కుటుంబ శుభకా ర్యాల్లోనూ అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు ఎల్లంపేట్ మున్సిపల్ 24వ వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్. 24వ వార్డు సభ్యులు పోచయ్య-సద్గుణ దంపతుల కుమార్తె వివాహం సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వివాహ వేడుక సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అర్చన శ్రీనివాస్, తమ వంతు సహాయంగా అక్షరాల పదివేల రూపాయలను అందించారు. ప్రజాప్రతినిధులు కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల వ్యక్తిగత సంతోషాల్లోనూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. కుమార్తె వివాహ సమయంలో అందించిన ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పోచయ్య--సద్గుణ దంపతులు తెలిపారు. కష్టసుఖాల్లో తమకు అండగా నిలిచిన కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలతో మమేకమై... వారి కుటుంబ వేడుకల్లోనూ భాగస్వామ్యమవుతూ అందించిన ఈ సహాయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# మేడ్చల్-కిష్టాపూర్‌లో కాంగ్రెస్ కమిటీల బలోపేతానికి కసరత్తు



**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్, కిష్టాపూర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కీలక సమావేశం నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాప రాజు, మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డివిజన్ కమిటీలు, అనుబంధ సంఘాల అధ్యక్షుల పేర్ల సేకరణపై ప్రధానంగా చర్చించారు. సమావే శానికి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజ కవర్గం SIR ఇన్‌చార్జి గజ్జల కాంతం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, అనుబంధ సంఘాలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, ప్రతి విభాగంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంపై నాయకులతో చర్చించారు. అనుబంధ సంఘాల అధ్యక్షుల పేర్ల సేకరణ ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేసి, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని నాయకులు సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో డివిజన్ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బాలు రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణ, మాజీ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, డివిజన్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి: మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ

### కొత్త పింఛన్లకు దరఖాస్తులు ప్రారంభం



మేడ్చల్: మేడ్చల్ సర్కిల్, మేడ్చల్ పట్టణ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరూ కొత్త సామాజిక భద్రత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఈత కల్లు గీతకారులు, చేనేతకారులతో పాటు పైలేరియా, డయాలసిస్, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి వ్యాధులతో బాధపడుతున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ప్రధాన ప్రాధాన్యతా వర్గాలు

వితంతువులు: నెలకు ₹2,016. 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులు. భర్త మరణ ధృవీకరణ పత్రం అవసరం. ఒంటరి మహిళలు: నెలకు ₹2,016. నిబంధనల ప్రకారం విడాకులు పొందిన వారు, భర్త వదిలివేసిన వారు, విడిగా నివసిస్తున్న వారు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు పైబడిన అవివాహిత మహిళలకు కూడా నిబంధనల మేరకు అర్హత ఉంటుంది. దివ్యాంగులు: నెలకు ₹4,016. వయస్సుతో సంబంధం లేకుండా అర్హత; సదరం/ఉడీడ్ ధృవీకరణ అవసరం. ఈత కల్లు గీతకారులు: నెలకు ₹2,016. 50 సంవత్సరాలు పైబడిన వారు, సంబంధిత సహకార సంఘ సభ్యత్వ ధృవీకరణ కలిగి ఉండాలి. చేనేతకారులు: నెలకు ₹2,016. 50 సంవత్సరాలు పైబడిన వారు, సంబంధిత శాఖ ధృవీకరణ అవసరం. పైలేరియా బాధితులు: వయస్సుతో సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం గ్రేడ్-II, గ్రేడ్-III బాధితులు అర్హులు. డయాలసిస్ రోగులు: వయస్సుతో సంబంధం లేకుండా, డయాలసిస్ చికిత్స పొందుతున్న అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు.

### సాధారణ అర్హతలు

దరఖాస్తుదారు భారత పౌరుడై, తెలంగాణ రాష్ట్ర శాశ్వత నివాసి అయి ఉండాలని తెలిపారు. ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలని, ఇప్పటికే ఇతర ప్రభుత్వ పింఛను లేదా స్వాతంత్ర్య సమరయోధుల పింఛను పొందుతున్న వారు అర్హులు కారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన భూమి, ఆదాయం, వాహనాలు, వ్యాపార సంస్థలు, ఉద్యోగాలు తదితర అనర్హత ప్రమాణాలు వర్తిస్తాయని తెలిపారు.

### దరఖాస్తు ఎక్కడ?

అర్హులు చేయూత పోర్టల్ నుంచి సాధారణ దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి వివరాలతో పాటు అవసరమైన ధృవపత్రాలను జతచేసి మేడ్చల్ పట్టణంలోని సిఎంసి డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని కౌడే మహేష్ కురుమ సూచించారు. "సామాజిక భద్రత ప్రతి ఒక్కరి హక్కు. అర్హత ఉన్న ఒక్కరూ అవకాశం కోల్పోకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలి" అని ఆయన కోరారు.

# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్.. 'మా పార్టీ గొప్ప' అంటూ పోటాపోటీ

- సమాజిక మాధ్యమాల్లో నువ్వ నేనా అంటూ రెచ్చిపోతున్న నాయకులు
- పోస్టులు, కామెంట్లతో హోరెత్తుతున్న రాజకీయం
- ప్రత్యర్థుల బలాబలాలు, బలహీనతలు బయటపెడుతున్న కార్యకర్తలు




**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** రాజకీయ పోరాటం ఇప్పుడు సభలు, సమావేశాలకే పరిమితం కావడం లేదు. సోషల్ మీడియా వేదికగా బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ వేడెక్కుతోంది. 'మా పార్టీ బలమైనది.. మా నాయకత్వమే ప్రజలకు అండ' అంటూ ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పోటాపోటీగా పోస్టులు, వీడియోలు, కామెంట్లు చేస్తుండటంతో రాజకీయ వాతావరణం మరింత హాట్‌గా మారుతోంది. తమ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, నాయకత్వ నిర్ణయాలను ఒక వర్గం కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. ప్రత్యర్థి పార్టీపై విమర్శలు గుప్పిస్తూ గతంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తున్నారు. దీనికి ప్రతిగా మరో పార్టీ కార్యకర్తలు కూడా అదే స్థాయిలో స్పందిస్తూ తమ పార్టీ సాధించిన విజయాలు, ప్రజల్లో ఉన్న ఆదరణను వివరిస్తున్నారు.

### బలాలే కాదు బలహీనతలపైనా ఫోకస్

సోషల్ మీడియా వార్‌లో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఇరు పార్టీల కార్యకర్తలు తమ పార్టీల గొప్పతనాన్ని చెప్పుకోవడంతో పాటు ప్రత్యర్థి పార్టీకి ఉన్న బలహీనతలను కూడా ఎత్తిచూపుతున్నారు. నాయకత్వం, స్థానికంగా పార్టీ బలం, ప్రజా సమస్యలపై పోరాటం, ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

### కామెంట్లతో మరింత వేడి


ఒక పార్టీ కార్యకర్త పెట్టిన పోస్టుకు ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు కామెంట్ల రూపంలో సమాధానం ఇవ్వడం.. ఆ తర్వాత మళ్లీ మరో పోస్టుతో కౌంటర్ ఇవ్వడం సాధారణంగా మారింది. దీంతో రాజకీయ చర్చలు సోషల్ మీడియా గ్రూపులు, పేజీల్లో గంటల తరబడి కొనసాగుతున్నాయి.

### సోషల్ మీడియానే కొత్త రాజకీయ వేదిక?

రాబోయే రోజుల్లో రాజకీయ కార్యకలాపాల్లో సోషల్ మీడియా ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే విమర్శలు ఆరోగ్యకరమైన రాజకీయ చర్చల స్థాయిలోనే ఉండాలని, వ్యక్తిగత దూషణలు, నిర్ధారణ లేని ఆరోపణలకు దూరంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. మొత్తంగా.. బీజేపీ--కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు ఇప్పుడు క్షేత్రస్థాయి కార్యక్రమాలతో పాటు సోషల్ మీడియా వేదికపైనా స్పష్టంగా కనిపిస్తోంది. 'ఎవరి బలం ఎంత? ఎవరి బలహీనత ఏమిటి?' అనే చర్చకు కార్యకర్తల పోస్టులు మరింత ఊతమిస్తున్నాయి.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి ఆదేశాలు





**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** ఖరీఫ్ 2026--27 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాల శాఖకు చెందిన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో ధాన్యం సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోళ్లకు అవసరమైన మేరకు గన్నీలు ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని శుభ్రపరిచి, బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. వరికోత సమయంలో హార్వెస్టర్, వరి నూర్పిడి యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు క్రమపద్ధతిలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం కాకుండా ధాన్యం కొనుగోలు జరిగిన రోజే ప్రతి ఎంట్రీని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎంట్రీల్లో జాప్యం కారణంగా రైతుల చెల్లింపులు ఆలస్యం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లింపులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో నిరంతర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు సకాలంలో సేవలు అందిస్తూ జిల్లాకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎల్. సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎండీ రియాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 13 ఆగస్టు 2026
5
సంపుటి : 18, సంచిక : 153

# కొంపల్లి రాజరాజేశ్వరి ఆలయం వద్ద యూ-టర్న్ మూసివేత

- **ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసుల కీలక నిర్ణయం**



**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** కొంపల్లిలోని రాజరాజేశ్వరి దేవాలయం సమీపంలో ఉన్న యూ-టర్న్‌ను నేటి నుంచి, ఆగస్టు 12, 2026 నుంచి పూర్తిగా మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలను నివారించి, వాహనదారులు, స్థానిక ప్రజల భద్రతను మెరుగుపరిచేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. యూ-టర్న్ మూసివేత నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. దేవరాంజాల్ నుంచి మేడ్చల్ వైపు వెళ్లేవారు: కొంపల్లి రోడ్ ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ ద్వారా వెళ్లాలి. కొంపల్లి నుంచి దేవరాంజాల్ వైపు వెళ్లేవారు: చిన్న వాహనాలు ఎ కన్వెన్షన్ వైపు ఉన్న వెహికల్ అండర్‌పాస్ను, భారీ వాహనాలు ప్రెస్టీజ్ పార్క్ వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ను వినియోగించుకోవాలని సూచించారు. మళ్లింపు మార్గాలు, అండర్‌పాస్‌ల సమీపంలో వాహనాల వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు కోరారు. వాహనదారుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూసివేసిన యూ-టర్న్ వద్ద రాంగ్ రూట్‌లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అలా ప్రయాణించే వాహనాల వల్ల తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు కొత్త ట్రాఫిక్ మార్పులను గమనించి, పోలీసులకు సహకరిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలలో భరోసా-షీ టీం అవగాహన సదస్సు




**భూపాలపల్లి ఆగస్ట్ 12 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఆదేశాల మేరకు భరోసా మరియు షీ టీం వారి ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్న కుమారి విద్యార్థినులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు మరియు విద్యార్థినుల భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు లేదా విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని, షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు దారుల వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు తమ చదువు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సై స్వప్న కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, భరోసా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎర్ర చెరువుకు చెత్త శాపం.. మున్సిపల్ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం!

- **చెరువులో డ్రైనేజ్ నీళ్లతో కంపుకొడుతూన ఎర్ర చెరువు**
- **వాకింగ్‌కు వచ్చే ప్రజలకు దుర్వాసన కష్టాలు.. చెరువు కట్ట డంపింగ్ యార్డుగా మారుతున్నా పట్టించుకోని అధికారులు**





**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ పట్టణానికి గుర్తింపుగా నిలిచిన ఎర్ర చెరువు నేడు చెత్త కుప్పలతో తన ఉనికినే కోల్పోయే పరిస్థితికి చేరుకుంటోంది. ప్రజలు ప్రశాంతంగా వాకింగ్ చేసేందుకు ఉపయోగించే చెరువు కట్ట.. ఇప్పుడు చెత్త పారబోయే ప్రదేశంగా మారుతుండటం పట్టణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. చెత్త కుప్పల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో చెరువు కట్టపై నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే చెరువులో డ్రైనేజీ కలవడంతో చెరువు పక్కన నడిచే పరిస్థితి లేదు చెరువును సుందరీకరిస్తామని ప్రజా ప్రతినిధులు హామీల వరకే పరిమితమై చెరువు దుర్గంధం వెదజల్లుతుంది.

### చెరువు కట్టపై చెత్త కుప్పలు

మేడ్చల్ మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను కొందరు చెరువు కట్టపై పడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపార కార్యకలాపాలు ముగిసిన తర్వాత చెత్తను చెరువు కట్ట వైపు తరలించి పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో రోజురోజుకూ చెత్త పరిమాణం పెరుగుతూ చెరువు కట్ట పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను తొలగించాల్సిన మున్సిపల్ పారిశుధ్య విభాగం సైతం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ప్రశాంతతకు వాకింగ్‌కు వస్తే దుర్వాసనే స్వాగతం పలుకుతుంది

ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం ఎర్ర చెరువు కట్టకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం బదులు చెత్త దుర్వాసనే స్వాగతం పలుకుతోంది. కుటుంబాలతో కలిసి వాకింగ్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వాకింగ్‌కు వస్తే.. చెత్త, దుర్వాసన మధ్య నడవాల్సిన పరిస్థితి ఏర్పడటం మున్సిపల్ పారిశుధ్య నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### చెత్త వేస్తున్న వారిపై చర్యలేవీ?

చెరువు కట్టపై బహిరంగంగా చెత్త వేస్తున్న వారిని గుర్తించడం పెద్ద సమస్య కాదని స్థానికులు అంటున్నారు. మార్కెట్ పరిసరాల్లోని వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటే చెత్తను ఎవరు తరలించి పడేస్తున్నారో గుర్తించవచ్చని చెబుతున్నారు. కేవలం చెత్తను తొలగించడం మాత్రమే కాకుండా.. మళ్లీ అదే ప్రదేశంలో చెత్త పడకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### చెరువును కాపాడాల్సిన అధికారులు.. చెత్తను కాపాడుతున్నారా?

ఎర్ర చెరువు పర్యావరణ పరిరక్షణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతకు మున్సిపాలిటీ ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించడం, చెత్తను తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, చెత్త వేసే వారిపై జరిమానాలు విధించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### ఇకనైనా అధికారులు మేల్కొంటారా?

ఎర్ర చెరువు కట్ట పరిస్థితిపై మున్సిపల్ అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చెత్త కుప్పలను వెంటనే తొలగించి, చెరువు కట్టను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు వాకింగ్ చేసే ప్రాంతం.. డంపింగ్ యార్డ్‌గా మారకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలి. ఎర్ర చెరువును చెత్త నుంచి విముక్తి చేసి, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలి.

# జమ్మికుంటలో జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం



- **జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం జనసేనదే !**
- **ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి బండారి రాజ్ కుమార్.**

**జమ్మికుంట అగస్ట్ 12 పీపుల్స్ డైరీ.** హుజూరాబాద్ నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణం పద్మశాలి భవనంలో బుధవారం విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జులు బండారీ రాజ్‌కుమార్, కృష్ణప్రియ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్షాల విమర్శలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనసేన పార్టీని తెలంగాణలో 'ఆంధ్ర పార్టీ' అని అనవసర విమర్శలు చేస్తున్న ఇతర రాజకీయ నాయకులకు ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. "తెలంగాణలో పోటీ చేస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా కేవలం తెలంగాణకే పరిమితమైనది కాదు. ఈ విషయాన్ని గుర్తించి ఇతర పార్టీల నాయకులు విమర్శలు మానుకోవాలి" అని గళమెత్తి స్పష్టం చేశారు.

### అవినీతి రహిత పాలనే జనసేన లక్ష్యం:

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అవినీతికి తావులేకుండా నిష్పాక్షికంగా పనిచేసేందుకు జనసైనికులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవినీతికి పాల్పడకుండా, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే నాయకులను, ప్రజలను పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.

### జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడం ఖాయం:

పార్టీ సిద్ధాంతాలు నచ్చి యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారని, వారందరికీ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నట్లు వెల్లడించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతున్నామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ జెండా ఎగరడం ఖాయమని, ఈ లక్ష్య సాధన కోసం జనసైనికులు మరింత చురుగ్గా, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘాల పోరాటం మొదలు పెడతా



**ఆళ్ళపల్లి ఆగస్టు 12(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రము లో తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ గడ్డం ఉమా రాణి కి వినతి పత్రం అందించడం జరిగింది అనంతరం కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హ తిరామ్, మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(ఖ్యూజ) గా అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రతిరోజు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు అగ్గి రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు రామయ్య, రామకృష్ణ, బద్రు, రామ్ చందర్, బావ్ సింగ్, వెంకటేశ్వర్లు, వీరన్న, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతి పత్రం



**శంకరపట్నం ఆగస్టు :12 పీపుల్స్ డైరీ :** మండలంలోని గొల్లపల్లి--కొత్తగట్టు గ్రామాల సౌకర్యార్థం అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ నిన్న మంగళవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, దేవస్థానం మాజీ చైర్మన్లు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు క్లుప్తంగా వివరించి, అండర్‌పాస్ నిర్మాణం ఆవశ్యకతను తెలియజేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా పనిచేసి, మన ఊరి భవిష్యత్తును మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరుకుంటున్నాం. మన ఊరి సౌకర్యాలు, అభివృద్ధి రాబోయే తరాలకు ఒక వరంగా నిలవాలి.

# విజయవంతమైన ఉచిత మెగా వైద్య శిబిరం

### సర్జరీ కోసం 52 మందిని హైదరాబాద్‌కు తరలింపు.పెండ్యాల ప్రభాకర్ చైర్మన్





**ఏటూరునాగారం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** ఏటూరునాగారం సాయిబాబా దేవాలయం మరియు సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర ఐ హాస్పిటల్ వారి సహకారంతో బుధవారం సాయిబాబా దేవాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ఏటూరునాగారం పరిసరాల్లోని సుమారు ఆరు మండలాల నుంచి దాదాపు 200 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ భోజన వసతి కూడా కల్పించారు. పరీక్షల అనంతరం సర్జరీ అవసరమైన 52 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్‌కు సర్జరీ నిమిత్తం తరలించినట్లు సాయిబాబా దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. సర్జరీ పూర్తయిన ప్రతి ఒక్కరికీ సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తామని ఆయన తెలిపారు. పేద, నిరుపేదలకు కంటి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్గడి జగదీష్, మెరుగు రఘుగౌడ్, రాజుపేట నర్సింగరావు, రాహుల్ ఫౌండేషన్ ప్రతినిధి రాహుల్, శంకర ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థాయికి మించి మాట్లాడితే ఊరుకునేది లేదు

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఇన్చార్జి ప్రణవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు**



**కమలాపూర్ ఆగష్టు 12 ( పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనవసర రగడ సృష్టించి సభా స్థలిని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రణవ్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని, పెండింగ్ పనులను పూర్తి చేయించి, కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించి పేదల సొంతింటి కలను నెరవేర్చారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తుంటే, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వేదికపై ప్రతి విషయానికి అడ్డుపడటం సరికాదని హితవు పలికారు. ఇళ్లలో ఏవైనా చిన్న చిన్న పనులు లేదా లోపాలు ఉంటే మరో ఇరవై రోజుల్లో పూర్తి చేసి, పది రోజుల్లో లబ్ధిదారులను గృహప్రవేశాలు చేయిస్తామని మంత్రి వేదికపై నుంచే స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయినా సరే ఎమ్మెల్యే మీడియా, సోషల్ మీడియా ప్రచారాల కోసమే హంగామా చేశారని విమర్శించారు. గతంలో రెండు సంవత్సరాలు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఇళ్లు ఎందుకు పంపిణీ చేయలేకపోయారో కౌశిక్ రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ కార్యకర్తల శ్రమతో ఓట్లు సాధించి, ఆ తర్వాత స్వార్థ ప్రయోజనాల కోసం మారిన చరిత్ర ఆయనదని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడిన మాజీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఇన్‌ఛార్జ్ ప్రణవ్ బాబులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డికి ధైర్యముంటే తన పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల్లో తనకున్న ఆదరణ ఏంటో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసాల శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షుడు గుండాపు చరణ్ పటేల్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, సహాయ కార్యదర్శి ఆడెపు విజయ, ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మౌటం కుమారస్వామి, పొడేటి బిక్షపతి, తడక శ్రీకాంత్, బొల్లం రాజిరెడ్డి, మాట్ల రవీందర్, రిక్కల నారాయణరెడ్డి, చెరిపల్లి రామచందర్, పేరుమాండ్ల తిరుపతి, అనిల్, పరుశరాములు గౌడ్, పల్లె సమ్మిరెడ్డి, కొండ తిరుపతి గౌడ్, పుల్ల శోభన్, పుల్ల ఐలయ్య, ధర్ముల శ్రీకాంత్, ఎంబాడి తేజ, ఆడెపు శ్రీకాంత్, మొండెద్దుల నాగరాజు, ఆకునూరి సాంబయ్య, మాట్ల కళ్యాణ్, ఎల్కటి అనిల్, మమ్మద్ అంజత్, పాక చంద్రమౌళి, డైరెక్టర్ లింగయ్య, జనగాని శివకృష్ణ, వార్డు సభ్యులు జన్ను బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టోల్‌గేట్ పనులు నత్తనడక...

**మట్టి రోడ్డుతో నరకయాతన**





**హుస్నాబాద్, టౌన్ : (పీపుల్స్ డైరీ) ఆగస్టు 12:** హుస్నాబాద్ మండలం పందిళ్ల స్టేజి సమీపంలోని జాతీయ రహదారిపై టోల్‌గేట్ నిర్మాణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నా పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం టోల్‌గేట్ పనులు, వాహనాల రాకపోకలకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డును వారు పరిశీలించారు. టోల్‌గేట్ నిర్మాణం నేపథ్యంలో సుమారు కిలోమీటరు మేర మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారని నాయకులు తెలిపారు. వర్షం కురిసినప్పుడు బురదగా మారుతుండగా.. ఎండ సమయంలో దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని, ప్రమాదాల ముప్పు కూడా ఉందన్నారు. టోల్‌గేట్ పనులు నత్తనడకన సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని, అప్పటివరకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డును సరిచేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల వికాస్‌యాదవ్, యాస శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మాటూరి రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి యువకుడి మృతి!..సంప్రద హాస్పిటల్ ముందు బంధువుల ఆందోళన

- **25 రోజులు చికిత్స.. రూ.16 లక్షలు ఖర్చు.. చివరకు 23 ఏళ్ల అజయ్ మృతి**
- **సదుపాయాలు లేకున్నా చికిత్స చేస్తామన్నారు"- మృతుడి తండ్రి ఆరోపణ**
- **మరో రూ.5 లక్షలు చెల్లించాలంటూ ఆస్పత్రి యాజమాన్యం డిమాండ్ చేశారంటూ బాధితుల ఆవేదన**



**మేడ్చల్ ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):-** మేడ్చల్‌లోని సంప్రద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందడంతో బుధవారం ఆస్పత్రి ముందు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో లేకపోయినా శస్త్రచికిత్స చేసి కోలుకునేలా చేస్తామని చెప్పి ఆస్పత్రిలో చేర్చుకున్నారని, సుమారు 25 రోజులపాటు చికిత్స అనంతరం యువకుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాళ్లకల్‌కు చెందిన అజయ్ (23) ఎంబీఏ విద్యార్థి. గత నెల 18న రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలు కావడంతో మేడ్చల్‌లోని సంప్రద హాస్పిటల్‌లో చికిత్స కోసం చేర్పించారు. ఇప్పటివరకు సుమారు రూ. 16 లక్షలు వైద్య ఖర్చులుగా వెచ్చించినప్పటికీ, బుధవారం చికిత్స పొందుతూ అజయ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.




## వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామన్నా

ఆస్పత్రిలో అవసరమైన వైద్య సదుపాయాలు లేవని గుర్తించి అజయ్‌ను మరో ఆస్పత్రికి తరలిస్తామని కుటుంబ సభ్యులు చెప్పినప్పటికీ, ఇక్కడే చికిత్స చేసి కోలుకునేలా చేస్తామని ఆస్పత్రి వర్గాలు హామీ ఇచ్చాయని మృతుడి తండ్రి సభాపతి శర్మ ఆరోపించారు. చివరకు కుమారుడు మృతి చెందడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

## మరో రూ.5 లక్షల బిల్లు.. ఆందోళన

అజయ్ మృతి అనంతరం తమకు ఇంకా రూ. 5 లక్షలు చెల్లించాల్సి ఉందంటూ ఆస్పత్రి యాజమాన్యం పట్టుబట్టిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో మృతుడి బంధువులు ఆస్పత్రి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. తమ కుమారుడిని కోల్పోయిన బాధలో ఉన్న తమను బిల్లుల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## గత ఘటనలను గుర్తుచేసిన బాధితులు

ఈ ఆస్పత్రిలో గతంలోనూ వైద్య ఖర్చుల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నాయని బంధువులు ఆరోపించారు. గతంలో చికిత్స పొందిన వ్యక్తి వైద్య బిల్లులు చెల్లించలేదనే కారణంతో ఆయన కుమారుడిని ఆస్పత్రిలో ఉంచి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు.

## అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్

యువకుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి, చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందా? అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ఆస్పత్రి నిర్వహణ, వైద్య ప్రమాణాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

# ఎమ్మెల్యే సార్...చిట్యాలలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి

- **చిట్యాల మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి అని వ్యాయామ ప్రియులు వాకర్స్ యువత కోరుతున్నారు.**





**చిట్యాల, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మారుతున్న కాలంతో పాటు జీవనశైలి మారింది. ఉరుకులు పరుగుల జీవితంలో ఒత్తిడి అలసట మానసిక బాధలు అధికమవుతున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి ప్రజలకు వస్తుంది. వాటిని అధిగమించడానికి వ్యాయామం తప్పనిసరి అయింది. అందుకుగా ఓపెన్ జిమ్ లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రైవేటు జిమ్ లకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా మండలంలోని అన్ని గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు లేదా తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో ఓపెన్ జిమ్ లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వ్యాయామ ప్రియులు యువత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామాల్లో ప్రభుత్వం గనుక జిమ్ లను ఏర్పాటు చేస్తే ఉదయం సాయంత్రం వినియోగించుకుని వ్యాయామం చేస్తూ ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో కూడా ఓపెన్ జిమ్ ల ఏర్పాటు చేయు విషయంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు వ్యాయామ ప్రియులు కోరుతున్నారు. ప్రైవేటు జిమ్ లకు వెళ్లే స్తోమత లేని పేద మధ్యతరగతి ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ప్రతిరోజు వ్యాయామం చేయడంతో ఫిట్నెస్ తో పాటు ఆరోగ్యం కూడా సొంతం చేసుకోవచ్చని నియోజకవర్గ ప్రజలు ఆశపడుతున్నారు. కానీ వారి ఆశలు అడియాశలుగానే మిగులుతాయా లేక నెరవేరుతాయా అనే కోణంలో వ్యాయామ ప్రియులు ఆలోచనలు చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులు ప్రజాప్రతినిధులు తలచుకుంటే మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టవచ్చు. ప్రైవేటు జమ్ములకు వెళ్లి అధిక ఫీజులు కట్టి చార్జీలు భరిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పేద మధ్య తరగతి సామాన్య కుటుంబాల యువకులు డబ్బులు కట్టి జిమ్ముకు వెళ్లడం భారంగా మారింది. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కూడా ప్రభుత్వం ఓపెన్ జిమ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అలాగే కోచ్ లను కూడా ఏర్పాటు చేయాలని యువకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్యం పట్ల సృహ అలాగే పుష్టికరమైన బలవర్ధకమైన ఆహారం తినాలని ఇష్టాలు కూడా బాగా పెరిగాయి. జిమ్ లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక దృఢత్వం కండరాలు బలంగా తయారవుతాయి. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. వ్యాయామం బరువు తగ్గడానికి ఒత్తిడిని తగ్గించడానికి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. జిమ్ సెంటర్లలో వ్యాయామం చేయడం వలన ఒత్తిడి తగ్గి ఆందోళనలు నిరాశ తగ్గించడంలో ఉపయోగ పడతాయి. మొత్తానికి జిమ్ లలో వ్యాయామం చేయడం వలన మెదడు పనితీరు మెరుగవడంతో పాటు మానసిక ఆరోగ్యం ఉంటుంది. మధుమేహం బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో నడక ఎంతో ఉపయోగ పడుతుంది. జిమ్ సెంటర్స్ లో వాకింగ్ మిషన్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే వ్యాయామం వాకింగ్ తదితర శారీరక శ్రమను కలిగించే పనులు చేసే సమయంలో ఇతర వ్యక్తులతో కలిసి జిమ్ చేయడం వలన సామాజిక ఆరోగ్యకర సంబంధాలను కూడా ఏర్పరచుకోవచ్చు. బలవర్ధకమైన ఆహారంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు వ్యాయామాన్ని నేటి యువత ప్రజలు ఎంచుకుంటున్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు మైదానాలు పార్కులు గ్రౌండ్లలో వాకింగ్ వ్యాయామం చేస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. మరి కొంతమంది జిమ్ లకు వెళుతూ ఫిట్నెస్ను పొందుతున్నారు.

ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం హైదరాబాదు హనుమకొండ వరంగల్ పరకాల లాంటి పట్టణాల్లో అనేక చోట్ల ఓపెన్ జిమ్ సెంటర్స్ అలాగే కాలినడక కోసం వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేయడంతో ప్రజలు వాటిని ఉపయోగించుకొని మంచి ఆరోగ్యాన్ని పొందుతున్నారు. కానీ చిట్యాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఎలాంటి వ్యాయామ జిమ్ సెంటర్స్ లేకపోవడంతో వ్యాయామ ప్రియులు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. స్థానిక భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవ తీసుకుంటే ముందుగా చిట్యాల మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ జిమ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వ్యాయామ ప్రియులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అతిపెద్ద మండలం గా పేరుగాంచిన చిట్యాల మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ లేక యువత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం జిల్లా మండల ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ప్రభుత్వ జిమ్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిమ్ ఏర్పాటు చేసే వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోగ్య తెలంగాణ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఒకవైపు చెబుతుంది. దీనిలో భాగంగానే పట్టణాలు నగరాలలో ప్రభుత్వమే స్వయంగా నిధులు కేటాయించి ఓపెన్ జిమ్ వ్యాయామశాలలను ఏర్పాటు చేస్తుంది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు అనారోగ్యంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం సంతులిత ఆహారంతో పాటు వ్యాయామం తప్పనిసరిగా అవసరమని వైద్య ఆరోగ్య నిపుణులు మరోవైపు తెలుపుతున్నారు. చిట్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ జిమ్ ఏర్పాటు చేసే విధంగా స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్తన్న ను స్థానిక జిల్లా మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి తెలుపాలని ప్రజలు కోరుతున్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు ఇండోర్ జిమ్ కూడా ఏర్పాటు చేసి వ్యాయామ వస్తువులను తెప్పించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వాకర్స్ వ్యాయామ ప్రియులు యువకులు కోరుతున్నారు.

# ఖబర్దార్ కౌశిక్ రెడ్డి..మీ పద్ధతి మార్చుకోండి

**ఇల్లంతకుంట దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు**



**ఇల్లంతకుంట అగస్ట్ 12 పీపుల్స్ డైరీ :** మొన్న కమలాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ ల కార్యక్రమానికి వచ్చిన కౌశిక్ రెడ్డి మాట్లాడిన తీరును ఈ రోజు దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు ఖండించడం జరిగింది. రామారావు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీ కార్యక్రమానికి రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వోడితెల ప్రణవ్ బాబు కి కాంగ్రెస్ పార్టీ కి వస్తున్న ఆధారణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ పైన బురద జల్లు తున్నాడని ప్రతి మీటింగ్ లో అతని ద్వంద వైఖరి ప్రజలకు తలనొప్పిగా మారిందన్నారు ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే ఓర్వలేని తెరాస పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు మ్మెల్యే కౌశిక్ రెడ్డి గెలిచి 3 సంవత్సరాలు కావస్తున్నప్పటికి ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదు అని,మన నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ అన్న హుజురాబాద్ ను అభివృద్ధి వైపు అడుగులేస్తుంటే కొంతమంది టిఆర్ఎస్ నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి ఇది ప్రజా ప్రభుత్వమా, నియంతృత్వమా అని అడుగుతున్నారు ఇది ప్రజా ప్రభుత్వం కాబట్టే కౌశిక్ రెడ్డి స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. ఇంకోసారి మా మంత్రుల పైన గాని మా నియోజకవర్గ ఇన్చార్జి పైన గాని మా కాంగ్రెస్ పార్టీ పైన గానీ అవాకులు చేవాకులు పేలితే కచ్చితంగా కౌశిక్ రెడ్డి పైన గతంలో కమలాపూర్ మండలంలో కోడిగుడ్ల దాడి జరిగినట్టుగానే దాడి చేస్తామని ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన హెచ్చరిస్తున్నాం. ప్రతిపక్ష పార్టీలు సైతం మెచ్చుకోదగ్గ ప్రజా ప్రభుత్వం మాది అని కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రెస్ మీట్ పెట్టి మరి గత ప్రభుత్వం మాకు ఏ రోజు కూడా అధికారికంగా కార్యక్రమాలకు పిలువలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రతి కార్యక్రమంలో మమ్మల్ని అధికారికంగా ఆహ్వానిస్తున్నారన్నారు. అలాంటి మా ప్రభుత్వం మీద బురదల్లే మీకు మీ టిఆర్ఎస్ పార్టీ నాయకులకు రానున్న ఎలక్షన్లలో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలే తగిన గుణపాఠం,బుద్ధి చెబుతారన్నారు. నీ వైఖరి నచ్చకనే మీ టిఆర్ఎస్ పార్టీ నాయకులే కొంతమంది మీటింగ్లు పెట్టుకొని మరీ మాజీ మంత్రి హరీష్ రావు ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని కలిసి మరీ మీ మీద ఫిర్యాదు చేయడం జరిగింది . అది మీ నాయకత్వ లక్షణం. కౌశిక్ రెడ్డి మీ పద్ధతి మార్చుకోండి హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గోలి కిరణ్,డీసీసీ కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుండారపు సాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ బీపాస్ .. అక్రమ నిర్మాణాలకు బైపాస్..!

» ప్రభుత్వ భూములు, పంట పొలాల్లో భారీ నిర్మాణాలు?
» తప్పుడు పత్రాలు సమర్పిస్తున్న వ్యాపారులు..
» తనిఖీలు చేయని టాస్క్‌ఫోర్స్ బృందాలు..
» క్షేత్రస్థాయి అధికారులు వద్దన్న చోట బిపాస్‌తో అనుమతులు ..



**పీపుల్స్‌డైరీ-ములుగు బ్యూరో :** భవన నిర్మాణాల కోసం ప్రత్యేకంగా తెచ్చిన టీఎస్-బీపాస్ విధానం అక్రమ నిర్మాణాలకు బైపాస్‌గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విధానంతో వేగంగా అనుమతులు పొందుతున్న దరఖాస్తుదారులు కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో అనుమతులు పొందుతున్నారని తెలుస్తోంది. స్థానికంగా అధికారులు అనుమతులు ఇవ్వని చోట టీఎస్-బీపాస్ లోపాలను, స్వీయ-ధ్రువీకరణ దుర్వినియోగంతో అనుమతులు తెచ్చుకుంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా ములుగు జిల్లాలో ఇలాంటి కట్టడాలు చేపట్టగా వాటికి కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం.

**ప్రభుత్వ భూములు పంట పొలాలు మాయం..**

ఆన్‌లైన్ దరఖాస్తులపై కఠినమైన క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో ప్రభుత్వ భూములు, పంట పొలాలు లక్ష్యంగా వ్యాపారులు టిఎస్ బిపాస్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడే యజమానులపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేసే అధికారులపై జరిమానాలు విధిస్తే తప్ప నిబంధనలు సరిగ్గా అమలుకావని పలువురు అంటున్నారు. తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింప చేయడం కోసం భూములను కబ్జా చేస్తూ తప్పుడు పత్రాలను సమర్పిస్తుండగా దానికి కొందరు అధికారులు సైతం కొమ్ముకాస్తున్న తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

**అనుమతులకు మించి అక్రమ నిర్మాణాలు...**

భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసే సమయంలో సమర్పించిన ప్లాన్‌ను విధిగా అమలు పర్చాలి. అనుమతి కాపీలో పేర్కొన్న విధంగా నిర్మాణం చేపట్టాలి. కానీ చాలా చోట్ల నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాంటి వారిపై టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసే అధికారం కలిగి ఉండగా ఇప్పటివరకు కనీసం తనిఖీలు చేసినట్లు కూడా కనిపించడం లేదు. దీనికి తోడు క్షేత్రస్థాయిలోని అధికారులకు అక్కడ చేపట్టే నిర్మాణాలపై ఎలాంటి అజమాయిషీ లేకపోవడంతో టీఎస్ బిపాస్ దుర్వినియోగం అవుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులు స్పందించి టీఎస్ బి పాస్ లో అనుమతులు పొంది అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**నిర్మాణాలు ఇవే..**
» తప్పుడు పత్రాలతో అనుమతులు
» ములుగు జిల్లాలో టీఎస్ బీపాస్ దుర్వినియోగం

వివరాలు : వచ్చే సంచికలో...

# నిలిచిపోయిన పనులు ప్రారంభం

» 'పీపుల్స్‌డైరీ' కథనానికి విశేష స్పందన
» ఇక డ్రైనేజీ సమస్యకు చెక్
» కదిలిన అధికార యంత్రాంగం
» 'పీపుల్స్‌డైరీ'కి స్థానికుల కృతజ్ఞతలు

**నర్సంపేట (పీపుల్స్ డైరీ) :** 'పీపుల్స్‌డైరీ' దినపత్రికలో ఈనెల 4న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. "రోడ్డు నిర్మాణం ఓకే... డ్రైనేజీ పరిస్థితి ఏంటి?" అనే శీర్షికతో వెలువడిన వార్త కథనం స్థానిక యంత్రాంగాన్ని కదిలించింది. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు వెడల్పు పనులలో డ్రైనేజీ సమస్యలు పట్టించుకోకపోవడంతో వ్యాపారస్తులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. రోడ్డు పనులు ముమ్మరంగా చేపట్టారు, డ్రైనేజీ నిర్మాణం నిలిచిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను, పీపుల్స్‌డైరీకి విన్నవిం చుకున్నారు. వేదనకు అంతం ఎప్పుడు? రోడ్డు నిర్మాణం ఓకే... మరి డ్రైనేజీ పరిస్థితి ఏంటి? ఏడు నెలలుగా నరకయా తన పడుతున్న స్థానిక ప్రజలు.... పట్టించుకోని మున్సిపల్ అధికారులు అంటూ ఈ కథనం స్పష్టంగా వెలుగులోకి తెచ్చింది.

వార్త కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించారు. స్థానిక నివాసితులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

పీపుల్స్‌డైరీ ఎఫెక్ట్


**హర్షం వ్యక్తంచేస్తున్న స్థానికులు... పీపుల్స్‌డైరీకి, అధికారులకు కృతజ్ఞతలు...**

డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేసిన 'పీపుల్స్ డైరీ' యాజమాన్యానికి, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు గ్రామస్థులు/స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వర్షకాలం పూర్తిస్థాయిలో రాకముందే ఈ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని వారు కోరుతున్నారు



# రీల్స్ మాయలో పడకండి

- పుస్తక పఠనం అలవర్చుకోండి
- విజయానికి దొంగదారులు వద్దు...
- షార్ట్‌కట్‌లను నమ్ముకుంటే జీవితాలు నాశనం..
- రీల్స్‌తో తగ్గుతున్న ఏకాగ్రత, ఆలోచన శక్తి
- యువత డిజిటల్ వినోదానికి అలవాటు పడొద్దు
- యూత్‌కు ప్రధాని మోడీ సూచనలు



**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** నేటి సమాజంలో క్షణంలో వైరల్ అయ్యే సోషల్ మీడియా రీల్స్ సంస్కృతిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఘాటుగా స్పందించారు. విజయం సాధించడానికి దొంగ దారులు, షార్ట్‌కట్‌లు వెతుక్కోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, ప్రగతి సాధించాలంటే సుదీర్ఘమైన అనుభవం, పుస్తక పఠనం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని, నేటి యువతరం రీల్స్ మాయలో పడకుండా ప్రముఖుల జీవిత చరిత్రలను, ఆత్మకథలను చదవాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ నేటి తరం ఆలోచనా విధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ రోజుల్లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ మోజులో పడి యువత కాలం వృథా చేసుకుంటోంది. రైల్వే స్టేషన్లలో తరచూ ఒక బోర్డు కనిపిస్తుంది.. 'షార్ట్‌కట్‌లు ప్రమాదకరం' అని! జీవితానికి కూడా ఇది వందకు వంద శాతం వర్తిస్తుంది. షార్ట్‌కట్ దారుల్లో విజయం వెతుక్కోవడానికి బదులు, ఉన్నత స్థాయికి ఎదిగిన మహనీయుల ఆత్మకథలను చదవడం అలవాటు చేసుకోండి. అది మీకు సరైన బాటను చూపుతుంది" అని ప్రధాని సలహా ఇచ్చారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అణకువ, ఆయన పాటించిన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా అత్యున్నత హోదాలో ఉన్నప్పటికీ, ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి ప్రధాని కారు దాకా వచ్చి సాగనంపే వారని, ఆ వినయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు. అలాగే, రాష్ట్రపతి అయ్యాక తన సొంత ఊరు పరౌంఖ్ కు వెళ్లినప్పుడు, ప్రాథమిక పాఠశాల గురువుల పాదాలకు నమస్కరించిన దృశ్యం దేశానికే గర్వకారణమని కొనియాడారు. ఎంతటి ఉన్నత స్థానానికి ఎదిగినా మూలాలను మర్చిపోకపోవడమే అసలైన వ్యక్తిత్వమని పేర్కొన్నారు.

# అరుదైన పాము ప్రత్యక్షం

» అచ్చం బొమ్మలా కదలకుండా స్థానికులకు దర్శనం
» నలుపు, పసుపు రంగు చారలతో ప్రత్యేకతగా...
» అత్యంత విషపూరితమైన బాండెడ్ క్రైట్‌గా గుర్తింపు

**పీపుల్స్‌డైరీ-ఖానాపురం :** వరంగల్ జిల్లాలో అరుదైన విషపూరిత పాము ప్రత్యక్షం కావడంతో స్థానికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామ శివారులో రోడ్డుపై నలుపు, పసుపు రంగు చారలతో ఉన్న పాము కనిపించింది. తొలుత దాన్ని చూసిన కొందరు బాటసారులు అది ఒక బొమ్మ అని భావించారు. అయితే అది కదలడం చూసి పాముగా గుర్తించారు. ఇలాంటి పాము గతంలో పెద్దగా కనిపించకపోవడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

స్థానికుల సమాచారంతో సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది, స్నేక్ క్యాచర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పామును పరిశీలించిన అధికారులు అది బాండెడ్ క్రైట్‌గా గుర్తించారు. దాదాపు 5 అడుగుల పొడవున్న ఈ పామును ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా పట్టుకున్నారు. అనంతరం పాకాల అటవీ ప్రాంతానికి తరలించి సురక్షితంగా వదిలిపెట్టారు. బాండెడ్ క్రైట్ అత్యంత విషపూరితమైన పాముల్లో ఒకటని అటవీ అధికారులు తెలిపారు. దీని విషంలో న్యూరోటాక్సిక్ ప్రభావం ఉండటంతో కాటు పడినప్పుడు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వివరించారు.

సాధారణంగా ఈ పాములు రాత్రివేళల్లో చురుగ్గా సంచరిస్తాయని.. నీటి వనరులకు సమీపంలోని పొదలు,



పుట్టలు వంటి ప్రాంతాల్లో కనిపిస్తాయని పేర్కొన్నారు. బాండెడ్ క్రైట్ శరీరంపై కనిపించే నలుపు, పసుపు రంగు చారలు ప్రత్యేకతగా ఉంటాయి. మన దేశంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో ఈ బాండెడ్ క్రైట్ అరుదుగా కనిపిస్తాయని అధికారులు తెలిపారు. తెలంగాణలో ఇలాంటి పాము కనిపించడం చాలా అరుదైన విషయమని పేర్కొన్నారు. ఇది ఇతర ప్రాంతాల నుంచి దారి తప్పి వచ్చి ఉండొచ్చని.. లేదంటే వాహనాల ద్వారా ఈ ప్రాంతానికి చేరి ఉండే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

ఈ అరుదైన పాము కనిపించడంతో అశోక్‌నగర్ పరిసరాల్లో స్థానికులు కొంత ఆందోళనకు గురయ్యారు. అయితే పామును సురక్షితంగా తరలించడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషసర్పాలు కనిపించినప్పుడు వాటిని స్వయంగా పట్టుకునేందుకు ప్రయత్నించకూడదని.. వెంటనే అటవీశాఖ లేదా సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలని అధికారులు సూచించారు. పాములను చంపకుండా, వాటిని సురక్షితంగా సహజ ఆవాసాల్లోకి తరలించేందుకు సహకరించాలని కోరారు.

# విచిత్రం...

» హ్యాండ్సమ్ సెలబ్రిటీ భర్తను వదిలి... కండక్టర్‌తో జంప్
» మస్తు సంపాద... మంచి మొగుడు...
» సీసీ కెమెరాలో లేచిపోయే సీన్ రికార్డు...





**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** మలయాళ ఫేమస్ యూట్యూబర్, ఇన్‌ఫ్లుయెన్సర్ అఖిల్ ఎన్ఆర్‌డీ లైఫ్‌లో ఊహించని సంఘటన చోటుచేసుకుంది. ఆయన ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మేఘ.. చెప్పాపెట్టకుండా అర్ధరాత్రి ఇంట నుండి పారిపోయింది. ఆమె ఒక కండక్టర్‌తో కలిసి వెళ్లిపోయినట్లు ఉన్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే సదరు కండక్టర్‌కు ఈమధ్యే ప్రభుత్వ ఉద్యోగం రావడంతో మేఘ అతనితో వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

వివరాల్లోకి వెళ్తే.. చదువుకునే సమయంలోనే అఖిల్, మేఘలకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. దీంతో కొన్నాళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఇద్దరూ.. చివరకు 2024లో పెద్దల సమ్మతితో పెళ్లి చేసుకొని వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. అఖిల్ మంచి యూట్యూబర్ కావడంతో.. భార్యను కూడా సోషల్ మీడియాకు పరిచయం చేశాడు. దీంతో ఇద్దరూ కలిసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ సోషల్ మీడియాలో మంచి ఆదరణ సంపాదించారు.

అయితే మేఘ మళ్లీ తన చదువును కొనసాగించాలనుకుంటున్నట్లు అఖిల్‌తో చెప్పడంతో అతను ఆమెను ఒక కోర్సులో చేర్పించాడు. దీంతో ఆమె రోజూ ఆ కోర్సు కోసం బస్సులో వెళ్లి వచ్చేది. ఈ క్రమంలోనే మేఘకు ఒక బస్సు కండక్టర్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఇటీవల ఆ కండక్టర్‌కు ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. దీంతో మేఘ అతనితో కలిసి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే అర్ధరాత్రి కండక్టర్‌తో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఇంట్లో మేఘ కనిపించకపోవడంతో కంగారుపడిన అఖిల్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ఆ వీడియోలో మేఘ ఇంట్లో నుంచి నైట్ డ్రెస్‌తో బయటకు వస్తూ చేతిలో సూట్‌కేస్ పట్టుకొని పరుగులు తీయడం, అక్కడ అప్పటికే వేచి ఉన్న కండక్టర్‌తో కలిసి కార్లో వెళ్లిపోవడం కనిపించింది. ప్రస్తుతం ఈ సీసీటీవీ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మేఘ ఇంట్లో నుంచి వెళ్లిపోయే సమయంలో డబ్బు, నగలతో పాటు విలువైన వస్తువులను కూడా తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వీడియో వైరల్ అవ్వడంతో ఈ ఘటనపై మేఘ ఒక వీడియో రిలీజ్ చేసి మళ్లీ డిలీట్ చేసినట్లు తెలుస్తోంది.

అఖిల్‌తో తన సంబంధం సరిగ్గా లేదని.. అతనికి వేరే అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయని, దానికితోడు తనపై వేధింపులు ఉన్నాయని.. అందుకే తాను ఇల్లు వదిలి వెళ్లినట్లు ఆమె ఆ వీడియోలో చెప్పినట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారిక వీడియో మాత్రం ప్రస్తుతం ఎక్కడా లేదు!

సంపుటి : 18, సంచిక : 153

# మెరుగవుతున్న అభ్యసన సామర్థ్యాలు

## ప్రతీ విద్యార్థికి 12 ఉచిత నోట్ బుక్స్ - డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్



**మట్టెవాడ, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):** ప్రభుత్వ కళాశాలల్లో జూనియర్ ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థులందరికీ నోట్ బుక్స్ పంపిణీ ఇవ్వబడుతున్నాయని, దీంతో విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతున్నాయని వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ అన్నారు. బుధవారం రంగశాయిపేట, సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత రాతపుస్తకాల(హన్ రూల్డ్ నోట్ బుక్స్) పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగవుతున్నాయని, రాతపుస్తకాలు లేని కారణంగా రాసే అభ్యసనం కోల్పోతున్నారని, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నోట్ బుక్స్ అందించిందని తెలిపారు. పాఠ్య పుస్తకాలతో పాటు రాత పుస్తకాలు ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారం తగ్గనున్నట్లు తెలిపారు. త్వరలో యూనిఫాం, బ్యాగ్స్, తదితర అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి 12 లాంగ్ నోట్ బుక్స్ అనగా ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.600 ఆదా కానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని అందులో మొత్తం 2,704 విద్యార్థులకు గాను 32,448 నోట్ బుక్స్ పంపిణీ అయినట్లు తెలిపారు. ఈ సంవత్సరం మారిన పాఠ్యాంశాల ప్రకారం 80 మార్కులు వార్షిక పరీక్షల్లో, 20 మార్కులు అంతర్గత మూల్యాంకనం ఉన్నందున అంతర్గత మార్కులకు గాను ఈ నోట్ బుక్స్ ను సద్వినియోగం చేసుకోవాలని, అధ్యాపకులు మారిన పాఠ్యాంశాలు, సిలబస్ బోధనపై పట్టు సాధించాలని డీఐఈఓ శ్రీధర్ సుమన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు సంపత్ కుమార్, కరుణశ్రీ, లైబ్రేరియన్లు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో పండ్ల మార్కెట్‌కు స్థలం కేటాయించాలి!

## పరకాల ఎమ్మెల్యేకు రైతు సంఘాల నాయకుల వినతి

**మట్టెవాడ, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):** వరంగల్ లో రైతుల ప్రయోజనాల కోసం పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేయాలని వరంగల్ పండ్ల మార్కెట్ భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ రైతు సంఘాల నాయకులు బుధవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డిని హన్మకొండలోని ఆయన నివాస గృహంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా రైతులకు ఒక వేదికగా ఉండాల్సిన పండ్ల మార్కెట్ లేదని దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘాల నాయకులు ఎమ్మెల్యేకి ఇచ్చిన వినతి పత్రంలో తెలిపారు. వివిధ రాష్ట్రాల నుండి, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి హోల్ సేల్ గా అమ్ముకోవడానికి వరంగల్ నగరానికి రైతులు అన్ని రకాల పండ్లను తీసుకొచ్చి అమ్ముకుంటారని వారు తెలిపారు. పళ్ళు అమ్ముకోవడానికి శాశ్వతంగా స్థల నిర్మాణం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వరంగల్ నగరానికి చుట్టూ ఉండే గ్రామీణ ప్రాంతానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల్లో గాని లేదా ప్రైవేటు భూమి కొనుగోలు చేసి కానీ 30 ఎకరాలలో పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేయాలని వారు ప్రకాష్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్, అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క మొగిలి, అఖిల భారత రైతు సమాఖ్య ఏఐకెఎఫ్ జిల్లా నాయకులు ఐత నగేష్, అఖిలభారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుదమల్ల భాస్కర్ తదితరులు ఉన్నారు.



# విజయవంతంగా ముగిసిన సర్ ప్రక్రియ



**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసిన సందర్భంగా కేసముద్రం మున్సిపాలిటీలో బూత్ స్థాయి ఏజెంట్లు మరియు బూత్ స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డా. అల్లం రమ మాట్లాడుతూ: ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా అందరి సహకారంతో పూర్తి చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ బానోత్ అరుణ కుమారి అధికారులు, పార్టీ నాయకులు గూగులోత్ వీరు నాయక్, భూమటి పురుషోత్తం రావు, రేణుకుంట్ల సుధాకర్ అంగన్వాడి టీచర్ రాజమణి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత నోటుబుక్స్ పంపిణీ



**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నోటుబుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి కేసముద్రం మున్సిపాల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న మున్సిపాల్ వైస్ చైర్ పర్సన్ అల్లం రామ నాగేశ్వర్ రావు జిల్లా రవాణా అధికార సంస్థ సభ్యుడు రావుల మురళి పాల్గొని విద్యార్థులకు నోటుబుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేం చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు అన్ని విధాలుగా సేవలు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రతిపక్ష నాయకుల కుట్రలో బలి కావద్దు

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



**శాయంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల కాలంలో శాయంపేట మండలంలోని చలివాగు నీటి లభ్యతపై అధికార ప్రతిపక్ష పార్టీల వాగ్వివాదం రోజురోజుకు పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు మాజీ ఎమ్మెల్యే గండ వెంకటరమణారెడ్డి చలివాగును పరిశీలించి రైతులకు నీరు ఇవ్వకుంటే స్వయంగా గేట్లు తీరుస్తామని ప్రకటించడంతో బుధవారం నాడు అధికార పార్టీకి చెందిన మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి చలివాగుపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చలివాగు ఆయకట్ట రైతులతో సమావేశం నిర్ణయించి రైతుల సూచన మేరకే నిర్ణయాలు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చి రెడ్డి అన్నారు. శాయంపేట మండలంలోని చలివాగు ప్రాజెక్టు తూము, నీటి మట్టాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బుచ్చి రెడ్డి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ప్రతిపక్ష నాయకుల కుట్రలో బలి కావద్దని, తాగునీటికి ప్రాధాన్యత అనంతరం సాగునీటి ఆలోచనలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఎల్నినో ప్రభావం ప్రపంచమంతా ఉంటే రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వ్యాఖ్యానించడం వారి అవివేకం అన్నారు. రైతులతో రాజకీయం చేయకుండా చిత్తశుద్ధి ఉంటే చలివాగు ప్రాజెక్ట్ ఆయకట్టులో వారికి ఉన్న సుమారు 50 ఎకరాలు సాగు చేయకుండా పేద రైతులకు నీరు పారే విధంగా క్రాప్ హాలిడే ప్రకటించుకోవాలని డిమాండ్ చేశారు. చలివాగు గేట్లు తానే ఎత్తుతానని రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే కు ఆ హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. మినిమం లెవెల్స్ మెయింటైన్ చేయాలని ఈమధ్య కాలంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేస్తే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో లిఫ్టింగ్ నిలిపివేయగా ప్రస్తుతం 14 ఫీట్ల నీరు ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్ల చక్రపాణి ,మారేపల్లి రవీందర్, అబ్బు ప్రకాశ్ రెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, చిందం రవి, నిమ్మల రమేష్, వైనాల కుమారస్వామి సర్పంచులు మారబోయిన ప్రభాకర్, మంద దీనా ప్రభాకర్, సతీష్, శివాజీ నాయకులు శ్రీనివాస్, శంకర్, బిక్షపతి, కుమారస్వామి, రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ హృదయ కలశ ముగింపు వేడుకలు

**నర్సంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామంలోని పంచాయతీ ఆవరణలో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ హృదయ కలశ పూజాదికాల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వికాస తరంగిణి నర్సంపేట శాఖ, వైష్ణవ అర్చక బృందం, గ్రామ శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమాలు ముగిశాయి. కలశానికి గ్రామ మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామ ప్రజలు 'జై శ్రీమన్నారాయణ' నామస్మరణ చేస్తుండగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లింది. భక్తులు బియ్యపు గింజలను కలశంలో సమర్పించి సీతారామచంద్ర మూర్తి దివ్య కృపాకటాక్షాలను, ఆచార్యుల అనుగ్రహాన్ని పొందారు.

## విలువలతో కూడిన జీవనం అవసరం

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి మంగళాశాసనాలతో ముడుంబై రామానుజ స్వామి గ్రామ ప్రజలు, విద్యార్థులు, మహిళలు, పురుషులను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలో ప్రేమానురాగాలు తగ్గి స్వార్థం పెరుగుతోందని, బంధాలు, అనుబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని అన్నారు. విలువలతో కూడిన జీవనం సాగించాలని, ఇతరులకు సహాయపడే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ శ్రీ విష్ణు పారాయణాన్ని నిత్య



జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## 15 రోజుల్లో నిరంతర 25 సత్సంగాలు

ఆధ్యాత్మిక సత్సంగం చివరి రోజు కలశ బాధ్యులు రంగనాథస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. 15 రోజుల పాటు నిరంతరంగా 25 సత్సంగాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో విటి సభ్యులు, మహిళలు ప్రయాణ బడలికను సైతం లెక్కచేయకుండా సమయపాలనతో పాల్గొన్నారని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర వస్రం, ఉపసర్పంచ్ బాషబోయిన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శ్రీరామ సేవా సమితి వ్యవస్థాపకులు ఉప్పుల కోటి, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోతులు దూకడంతోనే శిలాఫలకం కూలింది

## కళ్లెదుటే ఘటన జరిగిందన్న అటెండర్ విమల

**శాయంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకం కూలిపోవడంపై తలెత్తిన అనుమానాలకు పంచాయతీ సిబ్బంది తెరదించారు. శిలాఫలకాన్ని ఎవరూ కూల్చలేదని, కోతులు దూకి గద్దెను ఊపడంతోనే శిలాఫలకం కిందపడిందని పంచాయతీ అటెండర్ విమల స్పష్టం చేశారు. శిలాఫలకం కూలిపోయిన సమయంలో తాను అక్కడే ఉన్నానని విమల తెలిపారు. కోతులు దూకడంతో గద్దె కదిలి శిలాఫలకం కింద పడిందని పేర్కొన్నారు. దాదాపు పది రోజుల క్రితమే ఈ ఘటన జరిగినట్లు చెప్పారు. పంచాయతీ కార్యాలయానికి పింఛన్ కోసం వచ్చే వృద్ధులు గద్దెపై కూర్చునేందుకు వెళ్తుండటంతో అది ప్రమాదకరంగా మారకుండా గతంలోనే కర్రను ఆసరాగా పెట్టినట్లు వివరించారు. శిలాఫలకం కూలిపోవడానికి కోతుల దూకుడు తప్ప మరే కారణం లేదని ఆమె తేల్చిచెప్పారు. కాగా, పంచాయతీ కార్యదర్శి రాజారాంను వివరణ కోరగా తాను విధుల్లో చేరి కేవలం నాలుగు రోజులే అవుతోందని తెలిపారు. శిలాఫలకం



కూలిపోయిన విషయం తనకు తెలియదని, మీడియా మిత్రులు అడిగినప్పుడు తనకు తెలిసిన మేరకు సమాధానం ఇచ్చానని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. అటెండర్ విమల ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉందని, ఆమె చూస్తుండగానే కోతులు దూకడంతో గద్దె కూలిందని సిబ్బంది వివరించారని కార్యదర్శి తెలిపారు. దీంతో శిలాఫలకం కూలిపోవడంపై జరుగుతున్న అనుమానాలకు పంచాయతీ సిబ్బంది వివరణతో స్పష్టత వచ్చినట్లైంది. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కూల్చారన్న ప్రచారానికి ఆధారాలు లేవని సిబ్బంది స్పష్టం చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 25 మందికి జరిమాన

**మట్టెవాడ, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 27 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా రంగశాయిపేటకు చెందిన ఎండి.ఎజాస్ (38) కు 2 రోజుల జైలుశిక్ష, నర్సంపేటకు చెందిన రాచర్ల రంజిత్ (23)కు మూడు రోజుల జైలుశిక్ష విధించగా వారిని హుజురాబాద్ సబ్ జైలుకు పంపి, మిగతా 25 మంది వ్యక్తులకు కోర్టు రూ.18,300 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహన దారులకు కోర్టు రూ.1800 జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

# ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం




**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆవిర్భావించి దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మంది యువకిషోరాలను బలిదానం చేసిన ఏకైక విద్యార్థి సంఘమని, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వ హించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ పిలుపునిచ్చారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దానిలో భాగంగా అంబేద్కర్ సెంటర్ లోని ఎఐఎస్ఎఫ్ గద్దె వద్ద ఎఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శరత్ ఎగురవేశారు. అనంతరం శరత్ మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న ఎఐఎస్ఎఫ్ ఆవిర్భ వించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ముద్రకోల అనిల్, సింగిని రణధీర్, పానుగంటి ప్రేమ్ కుమార్, బోశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి!

## అండర్ అసెస్‌మెంట్లకు తావులేకుండా పన్నుల వసూళ్లు చేపట్టాలి - బల్దియా కమిషనర్ టి.వెంకన్న

**మట్టెవాడ, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో పన్ను వసూళ్లకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, బకాయిలను సమర్థవంతంగా వసూలు చేయాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో రెవెన్యూ అధికారులతో పన్నుల వసూళ్ల పురోగతి, కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు తదితర అంశాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిళ్ల వారీగా పన్నుల వసూళ్ల పరిస్థితిని, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అసెస్‌మెంట్ వారీగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. భారీగా పన్ను బకాయిలు ఉన్న ఆస్తుల వివరాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బకాయిల వసూళ్లకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన భవనాలకు సంబంధించి ఆన్ - అసెస్‌మెంట్లు, అండర్ - అసెస్‌మెంట్లను గుర్తించి సక్రమంగా పన్నులు విధించాలని సూచించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)లో పేర్కొన్న వివరాల ఆధారంగా అసెస్‌మెంట్ చేసి పన్నులు విధించాలని, ఎలాంటి అండర్ అసెస్‌మెంట్‌కు అవకాశం లేకుండా చూడాలని కమిషనర్ స్పష్టం చేశారు. బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు తమ పరిధిలోని ఆస్తులు, పన్నుల వివరాలను క్షేత్రస్థాయిలో





పరిశీలిస్తూ, వసూళ్ల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు, సిబ్బందిపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పన్నులు, ఆస్తి అసెస్‌మెంట్లు తదితర అంశాలపై కార్యాలయాలకు వచ్చే నగరవాసులతో మర్యాదగా, బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ జోనా కొత్త అసెస్‌మెంట్లు, పన్నుల వసూళ్ల పురోగతిపై వివరాలు వెల్లడించారు. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 613, ఖాజీపేట సర్కిల్ పరిధిలో 1,215 కొత్త అసెస్‌మెంట్లను గుర్తించగా, మొత్తం 1,828 అసెస్‌మెంట్లలో 464 అసెస్‌మెంట్లకు సంబంధించిన పన్నులను వసూలు చేసినట్లు తెలిపారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులపై సమీక్ష

అనంతరం చేయూత పింఛన్ల దరఖాస్తుల పురోగతిని కమిషనర్ వెంకన్న సమీక్షించారు. డిప్యూటీ కమిషనర్లను సర్కిళ్ల వారీగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారు 13 వేల చేయూత పింఛన్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, బిర్రు శ్రీనివాస్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ఓలు శ్రీనివాస్, బాకం సంతోష్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట డిపో నుండి ప్రత్యేక గోవా టూర్

## డిపో మేనేజర్ ఎం.సరస్వతి



**నర్సంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో నుండి ఆగస్టు 15వ తేది ఉదయం 05 గంటలకు 36సీట్లు గల సూపర్ లగ్జరి బస్సు ప్రత్యేక టూర్ ప్యాకేజిలో భాగంగా గోవా యాత్ర ఉంటుందని డిపో మేనేజర్ ఎం. సరస్వతి ఒక ప్రకటనలో తెలియజేసారు ఈ బస్సు హైదరాబాద్ నుండి హంపి క్షేత్రం ద్వారా కర్ణాటక లోని కుక్కే సుబ్రహ్మణ్ణేశ్వరా టెంపుల్, దర్మస్థల, ఉడిపి నుండి మురుడేశ్వర్, గోకర్ణ దైవ దర్శనాల తర్వాత గోవాకి వెళ్లడం జరుగుతుంది. గోవా యందు ఒక రోజు సమయం ఉంటుంది అనంతరం హైదరాబాద్ నుండి నర్సంపేట కి గురువారం 20వ తేదీన రాత్రి 12గంటల వరకు చేరుకుంటుంది.ఒక్కరికి 5500 ప్రయాణం చార్జి, 5రోజుల యాత్ర భోజనం వసతి గదుల ఖర్చు బాధ్యత పర్యాటకులదే ముందస్తు బుకింగ్ కొరకు 9704644543 ని సంప్రదించి ఈ సదావకాశాన్ని పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

## గిరిజన సంప్రదాయాల నడుమ వనదేవతల దర్శనానికి ఏర్పాట్లు చేయాలి - జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**గోవిందరావుపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 16వ తేదీన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ సందర్శన, గిరిజన సంస్కృతి సాంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతల దర్శనానికి ప్రణాళిక బద్ధంగా అన్ని పనులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడ్వాయి మండలం మండల పరిధి మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను, హెలప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్ లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తొలుత మేడారం సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలిప్యాడ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రత, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మక్క--సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై గుత్తేదారుతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే మిగిలిపోయిన గ్రానైట్ రాళ్లు, నిర్మాణ వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత గుత్తేదారునకు ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ ముఖ్యమంత్రి వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించే సందర్భంగా ఆశీర్వచనాలు, శేషవస్త్రాల సమర్పణ, మొక్కులు చెల్లించడం తదితర కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆలయ ఈవోను కలెక్టర్ ఆదేశించారు. వనదేవతల ప్రాంగణం చుట్టుపక్కల గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టి మొక్కలు నాటాలని, ఆలయ ప్రాంగణంలో గ్రానైట్ రాళ్లతో ఏర్పాటు చేసిన భారీ పీటీ బీమ్స్‌ను పూలతో ఆకర్షణీయంగా సుందరీకరించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా కనిపించేలా సుందరీకరణ పనులను పూర్తి పూర్తి చేయాలన్నారు. వనదేవతల దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించనున్నందున అవసరమైన ఏర్పాట్లతో సిద్ధం చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వాహనాల నియంత్రణ, ప్రోటోకాల్, రాకపోకలు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, ఆలయ ఈవో వీరస్వామి, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సింగ్, గుత్తేదారులు ఆదినారాయణ, తాడ్వాయి తహసిల్దార్ సురేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన సదస్సు



**నర్సంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మహేశ్వరం గ్రామం లో ఆరుతడి పంటలు పై జిల్లా వ్యవసాయ అధికారి వరంగల్ విజయ్ భాస్కర్ అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరంగల్ మాట్లాడుతూ రైతులు చెరువులలో నీరు లేని కారణంగ వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు అయిన పెసర, మినుము జొన్న పొద్దుతిరుగుడు పంటలు సాగు చేయాలి అని, సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వరంగల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూగర్భ జలాలు చాల లోతుకు పడిపోయడం వల్ల వరి పంట బోరు బావుల క్రింద ఎబ్బందిగా మారే అవకాశం ఉన్నమధున ఆరుతడి పంటలు వేసుకోవాలి అని రైతులకు తెలిపినారు. ఈ పంటలకు అవసరం ఉన్నా సీడ్ ను అంధుబాటులో ఉంచడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఏపూరి శ్రీనివాస్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్కుర్ మహేశ్వరం గ్రామ రైతులు పాల్గొన్నారు

# వార్డ్ మెంబర్లు లేకుండానే గ్రామసభ

## మండల వార్డ్ మెంబర్ల ఫోరమ్ ఎంపిడిఓకు వినతి



**మొగుళ్ళపల్లి, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో. మంగళవారం రోజున గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ యొక్క గ్రామ సభకి ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులకి గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని. ఏజెండా అంశాలతో కూడిన పుస్తకాన్ని వార్డు మెంబర్ల వద్దకు పంపకుండా. వార్డ్ మెంబెర్స్ సంతకాలు తీసుకోకుండా, సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి. నామమాత్రంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. పంచాయతీరాజ్ చట్టం 2018 వ్యతిరేకంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. కావున సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోగలరని మొగుళ్లపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ కి మండల వార్డు మెంబర్ల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మొగుళ్లపల్లి మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షులు చిలకమారి శ్రీనివాస్, తో పాటు అర్షం మహేష్, బండారి కొమురయ్య, ఇప్పలపల్లి వార్డు మెంబర్ దూడపాక శ్రీధర్, దూడపాక శ్రీకృష్ణ, పాల్గొన్నారు.



# పీక్లా తండాలో శానిటైజేషన్, బ్లీచింగ్ పనులు

**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభల కుండా జాగ్రత్తలు పాటిస్తూ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ బ్లీచింగ్ పౌడర్ వాడుతూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ గూగులోత్ ఝూన్సీ నరేష్ నాయక్, ఉప సర్పంచ్ గూగులోత్ రవి నాయక్ అన్నారు. నేడు కేసముద్రం మండలంలోని పీక్లా తండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి బ్లీచింగ్ పౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గూగులోత్ ఝూన్సీ నరేష్ నాయక్ మాట్లాడుతూ,ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో దోమలు మరియు ఇతర కీటకాల వ్యాప్తిని నియంత్రించడం కోసం బ్లీచింగ్ పౌడర్ను వినియోగించాలని గ్రామవంచాయతీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, గ్రామ నాయకులు, యువకులు, పాల్గొన్నారు.


# కొండాపూర్ చోరీ కేసు ఛేదన

## వేగంగా స్పందించిన పోలీస్ సిబ్బందికి అభినందనలు



**గణపురం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన బొట్టు రమణాకర్‌ను పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం కేసు వివరాలను ఎస్ఐ బి. అశోక్ వెల్లడించారు. ఈ నెల 10న కొండాపూర్ గ్రామానికి చెందిన దానం సమ్మయ్య ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పక్కా సమాచారంతో బొట్టు రమణాకర్ ను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి చోరీకి గురైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రమణాకర్‌ను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులతో పాటు మండల ప్రజలు అభినందించారు.

# ఎట్టకేలకు డ్రైనేజీ సమస్యకు చెక్



**నర్సంపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** పీపుల్స్ డైరీ దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. "రోడ్డు నిర్మాణం ఓకే... డ్రైనేజీ పరిస్థితి ఏంటి?" అనే శీర్షికతో వెలువడిన వార్త స్థానిక యంత్రాంగాన్ని కదిలించింది. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డు వెడల్పు పనులలో డ్రైనేజీ సమస్యలు పట్టించుకోకపోవడంతో వ్యాపారస్తులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.రోడ్డు పనులు ముమ్మరంగా చేపట్టారు, డ్రైనేజీ నిర్మాణం నిలిచిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను, పీపుల్స్ డైరీ కి విన్నవించుకున్నారు, వేదనకు అంతం ఎప్పుడు, రోడ్డు నిర్మాణం ఓకే మరి డ్రైనేజీ పరిస్థితి ఏంటి, మాదన్నపేట రోడ్డులో మురుగునీరుతో ముప్పు, షాపులలో నిలువలేకపోతున్న వ్యాపారస్తులు, తీవ్ర ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు, కంపెడు దుర్వాసన ఈగలు దోమలు విలయతాండవం, ఏడు నెలలుగా నరకయాతన పడుతున్న స్థానిక ప్రజలు, పట్టించుకోని మున్సిపల్ అధికారులు, అనే ఈ కథనం స్పష్టంగా వెలుగులోకి తెచ్చింది. వార్త కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం నిలిచిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించారు. స్థానిక నివాసితులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

### అధికారులకు స్థానికుల ధన్యవాదాలు

డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా కృషి చేసిన 'పీపుల్స్ డైరీ' యాజమాన్యానికి, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు గ్రామస్థులు/స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వర్షకాలం పూర్తిస్థాయిలో రాకముందే ఈ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**చిట్యాల, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్ పి సి నాలుగు దశల పోరాటంలో భాగంగా చిట్యాల మండల కేంద్రంలోని తాసిల్దారు వసంతరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇందులో భాగంగా టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పెద్దపల్లి యోగానంద చారి మాట్లాడుతూ యుఎస్పిసి ప్రకటించిన 29 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గత ఆగస్టు ఏడవ తేదీన పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయడం జరిగిందని మరియు నేడు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఆగస్టు19వ తారీకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించు ధర్నాను ఉపాధ్యాయులందరూ విజయవంతం చేయాలని తదుపరి ఆగస్టు 29న రాష్ట్ర కేంద్రంలో మహాధర్నాను కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జనరల్ సెక్రెటరీ జి ప్రతాప్ మరియు ఉపాధ్యాయులు బండారు సదయ్య బోడ అనిల్ కుమార్ తిరుపతి రమేష్ తదితర ఉపాధ్యాయులు, సర్వ శిక్ష ఉద్యోగుల నుండి నరేష్ మరియు రాజు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ నిలిపివేత

**గోవిందరావుపేట, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని33 /టీవీ లైన్ విద్యుత్సబ్ స్టేషన్ లో 33కెవి లైన్ పనులు ఉదయం 8గంటల నుండి 10 గంటల వరకునుండి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అధికారి తెలిపారు,కావున రైతులు, వినియోగదారులు, ప్రజా ప్రతినిధులు అందరూ సహకరించగలరని కోరారు.

# నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

**చిట్యాల, ఆగస్టు12 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చిట్యాల మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం జరుగు భూముల రీసర్వే గ్రామసభలలో పాల్గొంటారు. కార్యక్రమాలలో సంబధిత శాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

# మహాసభను విజయవంతం చేయాలి



**చిట్యాల, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 22న నిర్వహించనున్న జనసేన పార్టీ ఉమ్మడి వరంగల్--మహబూబాబాద్ పార్లమెంటు మహాసభను విజయవంతం చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ జనసేన నాయకులకు కార్యకర్తలకు జిల్లా నాయకులు దేవేందర్ పిలుపునిచ్చారు. హరిత కాకతీయ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీ మదిరెడ్డి దామోదర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో మహాసభ ఏర్పాట్లు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మహాసభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పిఓసి సనత్ కుమార్ జిల్లా నాయకులు దేవేందర్ టేకుమట్ల మండల ఇన్చార్జి మధుకర్ చిట్యాల మండల ఇన్చార్జి రమణ కుమార్ సీనియర్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్ఎస్ కల్వలలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు




**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వలలో గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, పంటల సమృద్ధి, సుఖసంతోషాలకు ప్రతీకగా తీజ్ పండుగను నిర్వహిస్తారని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు, తీజ్ నృత్యాలతో అలరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముఖ్య అతిథి గంటా సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత రామ చందర్ అమ్మ ఆదర్శ కమిటీ లింగాల కవిత పిచ్చయ్య ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కల్లం వీరారెడ్డి గండి శీను బాలకృష్ణారెడ్డి ఏకంబ్రం సత్యనారాయణ సదానందం నాగేందర్ ఆర్ బిక్షపతి యాకంబ్రం ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్ ఎండి జుబేర్ అలీ పార్వతి రాజేంద్ర చారి రాము రాములు బాల శివ రెడ్డి నాగరాజు లింగయ్య సిఆర్పి ఉదయ్ సునీల్ రాధ లచ్చుమ్మ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**చిట్యాల, ఆగస్టు 12(పీపుల్స్ డైరీ) :** ఈనెల 19వ తేదీన చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించనున్న యువ సమ్మేళన పోస్టర్లను యువ సమ్మేళన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. అనంతరం యువ సమ్మేళన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశం కోసం యువత అనే అంశంతో ఈనెల 19వ తేదీన చిట్యాల టేకుమట్ల మొగుళ్ళపల్లి మండలంలోని 15 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న యువతి యువకుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల రాజ్ కుమార్ మైదం శ్రీకాంత్ గుండా మణికుమార్ బుర్ర రాహుల్ బుర్ర అభిజ్ఞ గౌడ్ బుర్ర విశేష్ బుర్ర అవినాష్ నాగరాజు బండ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ విధానాలతో అప్పుల ఊబిలోకి దేశం

## యువతను విస్మరిస్తే పతనం తప్పదు - ప్రజా చైతన్య యాత్రకు ఘన స్వాగతం






**ఏన్కూరు, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మోడీ విధానాలతో దేశం రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకు పోతుందని ,దశాబ్ద కాలంలో 55 లక్షల కోట్ల నుంచి 205 లక్షల కోట్లకు అప్పు పెరిగిపోయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు .ఆదాయ రంగాలను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టి దేశాన్ని ప్రైవేటు పరం చేసే పనిలో మోడీ సర్కార్ నిమగ్నమైందని ఆయన తెలిపారు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం ఏనుకూరు మండలంలో జరిగింది. మూల పోచారం గ్రామంలోకి యాత్ర ప్రవేశించగానే సాంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన మహిళలు యాత్రకు ఘన స్వాగతం పలికారు . యాత్రకు నేతృత్వం వహిస్తున్న వారికి పూల మాలలు వేసి స్వాగతం పలికారు. యాత్ర మూలపోచారం రామ్ నగర్ తండా తిమ్మారావుపేట, రాఘవపురం, టిఎల్ పేట, ఏనుకూరు, జన్నారం, నూకలంపాడు గ్రామాల్లో సాగింది .ఈ సందర్భంగా జరిగిన వివిధ సభలలో హేమంత్ రావు మాట్లాడుతూ మోడీ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాక దేశ విచ్చినానికి కారణమవుతున్నాయన్నారు .దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, దశాబ్ద కాలంగా ప్రభుత్వ సంస్థల్లో నియామకాలు జరగలేదని హేమంతరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్పై ఆశలు సన్న గిల్లుతున్నాయని హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదన్నారు. సిపిఐ నిర్వహిస్తున్న పాదయాత్ర ముగింపు సభ ఖమ్మం లో జరుగుతుందని 13న జరిగే ముగింపు సభకుసిపిఐ రాష్ట్ర కార్యదర్శికూనం నేని సాంబశివరావు హాజరవుతారని హేమంతరావు తెలిపారు ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి నియోజకవర్గ కార్యదర్శి ఎర్ర బాబు రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతా దేవి జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు పో టు కళావతి మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ యాంగల ఆనందరావు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బనోత్ రాంబాబు ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ,మండల నాయకులు అమరనేని వీరభద్రం, తెప్పల సత్యం , మాదినేని వెంకన్న, పొన్నం రాంబాబు ,సొలం రాజు , లక్పతి, భీమేష్, అరుణ్, సైద, బోగినబోయిన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ఏన్కూర్, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారంలో పోస్ట్ కార్డు క్యాంపెయిన్ లో భాగంగా సీఎంకు సమస్యలపై సంతకాల సేకరణ చేసి పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1970 దశకంలో గిరిజన సంక్షేమ శాఖ యాజమా న్యంలో ప్రారంభమైన పాఠశాలలు మారుమూల ఏజెన్సీ, గిరిజన గ్రామాల్లో ఎందరో గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి ఉన్నతికి కారణమైన పాఠశాలలు,నేడు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు.అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రెసిడెన్షియల్, గురుకులాలపై చూపుతున్న శ్రద్ధ,పెడుతున్న ఖర్చులో కనీసం కొంచెమైనా గిరిజన సంక్షేమ పాఠశాలలపై పెడితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ,జిల్లా పరిషత్ పాఠశాలల్లో వేలాది పండిట్స్, పీఈటీ పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 నుండి 400మంది పండిట్స్,పీఈటీ పోస్టులను నేటికీ అప్ గ్రేడ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ గిరిజన ఉపాధ్యాయులపై సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు బి.శోభన్,బి.రవి,వి. రమేష్, పి.శ్రీనివాస్, కే.శ్యామల, బి.రవి (హిందీ) బి.సక్రాం,జె. నాగేశ్వరరావు, నాగమణి,డి.ఉషశ్రీ, నలిని,కపూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఘనంగా తిరంగా ర్యాలీ

**ఆత్మకూరు, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** భారతీయ జనతా పార్టీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చేతబూనిన జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు తీగల భరత్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, ఆర్టిఐ యాక్ట్ కన్వీనర్ ఎదులపురం శ్రావణ్ కుమార్,మాజీ అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శులు బయ్యా పైడి ఆచార్య, రవ్వ శివప్రసాద్, జిల్లా నాయకులు సముద్రాల రవి,మామునూరి శ్రీనివాస్, టింగిలికారి సత్యనారాయణ,ఊగ సాయి కృష్ణ,



బీజేవైఎం అధ్యక్షులు పోరెడ్డి ప్రదీప్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, మండల నాయకులు వంగాల బుచ్చిరెడ్డి, పూజారి రవీందర్, బొల్లేపల్లి రాజు గౌడ్, ముద్దర గోపాల్, జక్కుల మహేందర్, తిప్పని రాంబాబు, సోషల్ మీడియా కన్వీనర్ బలభద్ర దినేష్, బూత్ అధ్యక్షులు యదా కుమార్, కిరణ్, సర్దార్, రజినీకాంత్, రాచర్ల నరేష్, పోగుల యాదగిరి, రాజేందర్, మాలగం, స్వామి, సునీల్ రెడ్డి, సునీల్, వేల్పుగొండ రవి,సుధాకర్, రత్నాకర్, కైలాసపతి, వాడికార్ రాజు, ప్రవీణ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



## చిట్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ

**చిట్యాల, ఆగస్టు 12(పీపుల్స్ డైరీ) :** భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను చేతబూని దేశభక్తి నినాదాలతో చిట్యాల మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రావుల రాకేష్ మైదం శ్రీకాంత్ బిజెపి సీనియర్ నాయకులు చెక్క నరసయ్య గజనాల రవీందర్ గుండ ఓదెలు శ్రీహరి నగవత్ పూర్ణ మండల ఉపాధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ రెడ్డి కేంసారపు ప్రభాకర్ వల్లాల ప్రవీణ్ చందు కల్వచర్ల కిషోర్ రాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో జాతీయ జెండాల ప్రదర్శన

**శాయంపేట, ఆగస్టు 12,(పీపుల్స్ డైరీ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ తిరంగా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు బాసని విద్యాసాగర్, మండల ఉపాధ్యక్షులు కోమటి రాజశేఖర్, భూత్ అధ్యక్షులు బాసని నవీన్, కన్నెబోయిన రమేష్, బత్తుల రాజేష్, ఆనుకారి శివాజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు,యువత తదితరులు పాల్గొన్నారు.



## కేసముద్రంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**కేసముద్రం, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు మండల కేం ద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. బీజేపీ మండల



శాఖ అధ్యక్షుడు ఉప్పు నూతుల రమేష్, బీజేపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాల ప్రాంగణం నుండి ఈ దేశభక్తి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భారీ ర్యాలీలో జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరంగా మండల కన్వీనర్ గడ్డం అశోక్ జిల్లా 'హర్ ఘర్ తిరంగా' కన్వీనర్ ధార హిందూ భారతి జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు ఓలం శ్రీనివాస్ మున్సిపాలిటీ కన్వీనర్ బోగోజు నాగేశ్వర చారి తదితరులు లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, ఐత సారయ్య, పూర్ణకంటి భాస్కర్, వెలిశాల సవీన్, భూక్య విజయ్, చంద్రకళ, గాంతి వెంకట్ రెడ్డి, బానోతు రాము, జుజ్జూరు వీరభద్ర చారి, బానోతు రమేష్, సంపత్, చలగోల వెంకటేష్, మూడవత్ అశోక్, వాంగుడోత్ నరేష్, వెలుపుల ఐలయ్య, అనిల్, కుమార్, బానోత్ సురేందర్ తో పాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన స్పెషలాఫీసర్



**ఏన్కూరు, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని జన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ ఎండీ ముజాహిద్దీన్ పరిశీలించారు. వంట పరిసరాలను, స్టోర్ రూమ్‌ను పరిశీలించి ,పదవ తరగతి విద్యార్థుల యొక్క విద్యా నాణ్యతను పరిశీలించారు. తరువాత విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బందితో సమీక్షా సమావేశంను నిర్వహించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత బాగుందని ,వంట పరిసరాలు స్టోర్ రూమ్ చాలా శుభ్రంగా ఉన్నాయని ప్రశంసించారు. 10వ తరగతి విద్యార్థులు బాగా చదువుతున్నారని ,వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వేణు ,ఉపాధ్యాయులు బి చక్రపాణి ,ఎస్ శ్రీనివాసరాజు, ఎస్.కె మొహమ్మద్ అలీ ,బి దేవ్ సింగ్, ఏ అనురాధ, కే.దీపక్ పాల్గొన్నారు.

## లచ్చగూడెంలో అంగన్వాడీ టీచర్లకు శిక్షణ



**ఏన్కూరు, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని లచ్చగూడెం రైతు వేదికలో బుధవారం మానవ అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై అంగన్వాడి టీచర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది హైదరాబాద్ ప్రజ్వల స్వచ్ఛంద సంస్థకు చెందిన రిసోర్స్ పర్సన్లు భూపాల్ హరీష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బక్కమ్మ తదితరులు పాల్గొన్నారు

## తక్షణమే సమస్యకు పరిష్కారం

### సర్పంచ్ చాట్ల విజయ రవీందర్

**మొగుళ్ళపల్లి, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని, తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రతి వార్డును కలియ తిరుగుతూ. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకునే స్వభావం సర్పంచ్



ది. గ్రామంలో సైడ్ డ్రైనేజీలు అంతంతమాత్రంగా ఉండటంతో, ఒక వార్డు మధ్యలో పైపులు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిలిచి ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, సంబంధిత అధికారులతో మాట్లాడి ఘటన ప్రదేశంలో పైపులు వేయించే పనులను. జేసీబీ సహాయంతో తవ్వకాలు జరిపి, పైపులను ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ సమస్య చిన్నదా పెద్దదా అని ఆలోచించకుండా వెంటనే పరిష్కరిస్తారని. గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## శ్రీ విశ్వకర్మ సంఘం మేడిపల్లి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**బోడుప్పల్, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** శ్రీ విశ్వకర్మ సంఘం మేడిపల్లి నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.సంఘం అధ్యక్షులు కందోజు వెంకటాచారి,ప్రధాన కార్యదర్శి కూరెళ్ల లక్ష్మీనారాయణ చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.అధ్యక్షులుగా బెజ్జంకి శ్రీనివాస చారి,ప్రధాన కార్యదర్శిగా శ్రీరామోజు వేణుచారి,కోశాధికారిగా మొలుపోజు రాజు చారి,ఉపాధ్యక్షులుగా పులిమామిడి కృష్ణ చారి,కాసోజు కృష్ణ బ్రహ్మచారి,సహాయ కార్యదర్శులుగా మంద ఆనంద్,ఎర్రోజు శ్రీనివాస్ చారి,పోలోజు శ్రీనివాస చారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. సంఘం స్థాపించిన నాటి నుంచి 21 సంవత్సరాలుగా ఏకతాటిపై సంఘాన్ని ముందుకు నడిపిస్తూ అభివృద్ధికి కృషి చేసిన కందోజు వెంకటాచారి, కూరెళ్ల లక్ష్మీనారాయణ చారి సేవలను అభినందించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం సర్వేశ్ చారి,జంగా చారి,రమేష్ చారి,పబ్బోజు శ్రీనివాస్ చారి, సోమాచారి,సుత్తోజు కుమార్ స్వామి,బాలా చారి, శంకరాచారి, రాములు చారి,బాలరాజు చారి,శ్రీనివాస చారి,రామాచారి సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## మూడు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

**మణుగూరు, ఆగస్టు 12 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ మిషన్ భగీరథ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు రథం గుట్ట వద్ద చేపట్టిన దీక్ష




శిబిరం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి సందర్శించి మిషన్ భగీరథ కార్మికులకు సంఘీభావం తెలిపారు. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటిని అందించే మిషన్ భగీరథ సేవల్లో కీలకంగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కర్నే రవి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను తక్షణమే విడుదల చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే వారి తరపున మరింతగా పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com